# ఎందుకు వ్రాశాను?

నిప్పుసెగ సోకితే వెన్న కరిగిపోదా? అంతే. సరదాకి మాత్రం వ్రాయలేదు.

ఓ రోజు 'స్టేట్స్‌మన్' పేపరు చదువుతూంటే కళ్లపడిన వార్త నా మనసుని కలచివేసింది. కలకత్తాలోని ఒక హైస్కూల్లో సంవత్సరాంతం పరీక్షలు జరుగుతున్నాయి. ఏ విప్లవకారులు, దుండగీడులు ఆ పరీక్షలు జరగకుండా ఏం చేస్తారోనన్న భయంతో పిల్లల తలిదండ్రులు స్కూలు చుట్టూ కాపలా కాస్తున్నారు. వారిలో ఒక నిర్భాగ్యురాలుంది. ఆమె ఒక ప్రముఖ విప్లవ నాయకుని భార్య. అతను ప్రభుత్వానికి పట్టుపడకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఆమె తన బిడ్డల భవిష్యత్తేమిటవుతుందోనన్న ఆవేదనతో వీరందరితోపాటు స్కూలు గేటు దగ్గర కాచుకుని కూర్చుంది. ఆమె కళ్లంట ధారాపాతంగా కురుస్తూంది కన్నీరు. ఇక నేను చదవలేకపోయాను. ఆమెపై సానుభూతి చూపడానికి కూడా లోకానికి భయమే. ఆమె జీవితానికిక ఏడుపు కాక మిగిలిన దేమిటి? ఇలాంటి అభాగ్యులెందరో! ఆ కన్నీ రెవరి గుండెను కరిగించదు? ఈ కథ వ్రాయడానికదో కారణం.

కాని, వ్రాయగలగటానికి మరో ముఖ్య కారణముంది. తెలుగు పాఠకుల అభిరుచి, ఆదరణ ప్రేమ కథలవరకే పరిమితం కాదని నాకు గల గాఢవిశ్వాసం. ఆ విశ్వాసమే లేకుంటే నే నీ కథ నెప్పటికీ కాగితం మీద పెట్టలేకపోయేదాన్నేమో!

కలతపడిన మనసులోంచి వెలువడిన ఈ కథ ఏ హృదయాన్ని స్పందింపజేసినా నా శ్రమకు తగు ఫలితం లభించిం దనుకుంటాను.

—రచయిత్రి

"ఆహా! ఈ వాడ ఎంత పెట్టి పుట్టింది! అబ్బ... ఈ దిబ్బ లెంతపుణ్యం చేసుకున్నాయి! ప్రజలు నోచిననోము ఎంత ఘనమైనదో కదా... భుజంగరావుగారి లాంటి అగర్వ శ్రీమంతుడు తన బంగారు పాదాలతో ఈ గడ్డ మీద కాలు మోపడం — ఆహా, ఎంత ఉత్కృష్టమైన రోజు! దయకు మారుపే రాయన. దాతలకు తాత ఆయన. సృష్టికర్తకే గర్వకారణ మాయన. ఓహో! తప్పుకోండి ... తప్పుకోండి... వచ్చేస్తున్నారు!"

గంటల తరబడి కాళ్లు పీక్కు పోయేలా నిలుచుని ఉన్న దరిద్ర ప్రజానీకాని కా చివరి ముక్క చాలా నచ్చింది. ఆ ముక్క చెప్పడాని కంత ఉపోద్ఘాత మిచ్చిన దుర్మార్గులు భుజంగరావు అనుచరులు కాకపోయినా సరే, క్షమించేయడానికి సిద్ధపడ్డట్టే ఉన్నారు.

కథల్లో దేవదూత లాగ తెల్లని దుస్తుల్లో ప్రత్యక్షమై, గతుకుల బాటలో కూడా హుందాగా ఒక్కొక్క అడుగే వేస్తూన్న భుజంగరావు గారి మీద తెలిసో, తెలియకో ఆ మురికి పేటలోని ఈగైనా, దోమైనా వాలవచ్చునన్న భయంతో అనుచరు లాయన్ని వెయ్యి కళ్లతో కాపాడుతున్నారు. అంతగా ముద్దు పొందుతూన్న వ్యక్తిని చూసి తీరాలని తొందరకొద్దీ ఒకరిమీ దొకరు తోసుకు పోతున్నారు జనం.

"మహా ప్రజలారా! ఆగండి ... ఆగండి ... వారు మీ అందరికి కనుపించి మాట్లాడాలనే వచ్చారు... తోసుకోకండి!" ఎవరో గట్టిగా అరుస్తున్నారు.

ప్రజలందరకు కనపడేలా, మేట వేసుకుపోయి ఎత్తుగా తయారయిన ఓ దిబ్బ మీదకు దయచేయవలసిందిగా భుజంగరావుగారిని ఆహ్వానిస్తున్నారు. వేళ్లతో సహా పెకలించుకు వచ్చి పక్కగా పడి ఉన్న వటవృక్షం కొమ్మల్ని ఆసరాగా పట్టుకుంటూ భుజంగరావుగారు దిబ్బ నెక్కి వినమ్రంగా చేతులు జోడించారు.

శ్మశానంలా పాడుపడిపోయిన వాడని చూడరావటమే కాకుండా, ఏదో సహాయమూ గట్రా చెయ్య బోతూన్న ఆ శ్రీమంతుడి నమస్కారానికి, 'అయ్యో! అంతపనా!' అని తెంపలేసుకుంటూన్నట్లుగా కొన్ని వందల చేతులు జోడించుకున్నాయి.

భుజంగరావు గారి నయనాలు దరిద్ర నారాయణులందరినీ ఓ మారు పరికించి అలా అలా కనుచూపు మేర వరకు సాగాయి. ఎక్కడ చూసినా కూలిన గుడిసెలు, విరిగి పడిన కొమ్మలు, వేళ్లతో సహా ఊడివచ్చిన చెట్లు, వరదకు కోసుకుపోయి ఏర్పడిన గుంటలు, మేట వేసుకుపోయిన దిబ్బలు, ఆ దిబ్బల వెనక ఏ వేవో జ్ఞాపకాలు. అలా విప్పార్చుకుని చూస్తూన్న కనులలో సర్రున రేగిన గాలి కో ధూళికణం ఎగిరివచ్చి పడింది.

రుమాలుతో కళ్లొత్తుకున్నా రాయన. రెండు నిమిషాల తరవాత తెరవబడిన కళ్లు మునుపటికంటే తడిగా, ఎర్రగా ఉన్నాయి.

"పాపం! ఎంత జాలి మనసో!" అంటూన్న వ్యక్తిని పొగడ వద్దన్నట్లుగా సంజ్ఞ చేస్తూన్న భుజంగరావు గారు క్షణక్షణానికీ విశిష్టతను సంతరించుకుంటున్నారు.

"సోదర సోదరీ మణులారా!"

సాక్షాత్తు శ్రీ మన్మహావిష్ణువు లాంటి సోదరుడు లభించినట్లు ప్రతి నిర్భాగ్యుడూ మురిసిపోతున్నాడు.

దిక్కులు మార్మోగేలా ఉపన్యాస ధార సాగిపోతూంది, చెవిటి వాడి ముందు శంఖనాదంలా, ఎందుచేత నంటే, దిక్కులు కాని, దిబ్బలు కాని ఆ ఉపన్యాసం వినదలుచుకోలేదు. వాటి కేదో గతం జ్ఞాపకమొస్తూంది. ఆ రోజు ... ఆ రోజు...

• • •

పెళ్లికూతురు లాంటి అందాల మహా నగరా న్నానుకున్న ఆ దిష్టి చుక్క లాంటి పల్లె పేరు 'ఆకలి వాడ'. అక్క డెప్పుడూ ఆకలి శబ్దం ప్రణవనాదంలా ప్రజ్వరిల్లుతూంటుంది మరి! చిరుగు లేని బట్ట కట్టిన వా డెవడయినా దారంబట పోతూండటం తటస్థిస్తే ఆ వాడ వాడంతా చోద్యంగా కళ్లింతింత చేసుకు చూడక మానరు. ఆ చూపులకి ఆ వాడలో వాడే అయితే సిగ్గుతో తల దించుకుంటాడు, వాళ్ల అవతారాల నోమారు ఓరగా చూసి, తను మహాపరాధం చేసినట్లు. అదే అవసరార్థం పట్నం నుంచి వెళ్లిన వాడయితే తానొక పోలీసు ఆఫీసరయి, ఈ సరుకంతా పట్టి దొంగ వెధవలయితే, షూట్ చేసి పారేస్తే బాగుండు నన్నట్లు చూస్తాడు.

అసలా పల్లె పేరు 'ఆకుల వాడ'ట. అడ్డాకులతో విస్తళ్లు కుట్టి పట్నానికి తెచ్చి అమ్మే వారట. కాలక్రమాన విస్తళ్ల వాడకం తగ్గి, తగు ప్రోత్సాహం లభించక పోవడంతో ఆ వృత్తి క్రమంగా క్షీణించి పోయింది. నిరుద్యోగులు, సోమరిపోతులు, అనాథలు, అన్నార్తులకు నిలయమై పోయిన ఆకులవాడ కాస్తా ఆకలివాడ అయి కూర్చుంది.

మూలిగే నక్క మీద తాటిపండులా, ఆ రోజు దావానలంలాగ వ్యాపించిన వార్తతో ఆ వాడ వాడంతా అట్టుడికిన ట్టుడికిపోయింది. వచ్చేస్తూంది ప్రళయం... పెను తుఫాను... సాగర గర్భాన్ని చీల్చుకుని వికృత పిశాచంలా వీర విహారం చెయ్యటాని కొచ్చేస్తూంది. ఇరవై నాలుగు గంటల్లోగా ఖాళీ చెయ్యక పోతే ఆకలి వాడలో మనిషి జీవించే ఆశ లేదు. రేడియో పెట్టె గగ్గోలు పెడుతూందట.

అప్పటికే కురిసిన వానలతో జారూ బురదలో కూరుకుపోతూన్న జనానికి స్థిమితం లేదు.

ఆకలివాడ అసలే బాగా పల్లపు ప్రాంతం. అందులో ఎక్కడ చూసినా బురద గుంటలు, కుళ్లు కాలువలు, దుర్గంధం, అనారోగ్యం. అది బాగుచెయ్యటం బ్రహ్మ తరం కూడా కాదట! ఇక సామాన్య ప్రభుత్వాధికారులేం చెయ్యగలరని చేతులు జోడించేశారట ఎప్పుడో.

ఇక తుఫానట కూడా! ఈ పల్లె ఏ మవుతుందో? మనమంతా ఏమయిపోతామో? పోవాలి ... పోవాలి... ఎక్కడికో వేగం ... లెండి ... లెండి ... ప్రళయం... ప్రళయం ... పెనుభూతం ...' ఎక్కడ విన్నా ఇవే అరుపులు.

ఆ రోజు ఉదయం నుంచే సిగ్నలిచ్చినట్లుగా ఈదర గాలితో సన్నని జల్లు ప్రారంభమైంది. వేళ తెలియకుండా మసుబు కమ్మేసింది. ఎవరి ముఖాల్లో చూసినా ఆందోళన, ఆరాటం, భయం తాండవిస్తున్నాయి.

'పది హేనేళ్ల క్రిందట ఓసారి తుఫాను కిలాగే పల్లె అంతా తుడిచి పెట్టుకు పోయిందట. ఇప్పు డేమవుతుందో? ఇద్దరు మనుషులు కలిసిన చోటల్లా ఇదే మాట.

పట్నంలో తెలిసినవాళ్లో, బంధువులో ఉన్న వాళ్లంతా మధ్యాహ్నానికి పారిపోయారు. పారుగూరికి



–ఎ. శ్యామలారాణి

రక్తమే ... ఆకలే ... ఆకలే ... ఆకలే!" అదే పనిగా వినిపిస్తున్న ఘోష విని రెండు చెవులూ మూసుకుని ఏదో మాట్లాడాలని పెదవులు తడి చేసుకుంది. కన్నీటితో నానిపోయిన పెదవులు ఉప్పగా తగిలాయి.

"రాముా! నీళ్లు తే, అమ్మా." పెదవులు చీల్చుకుని మెల్లగా బయటి కొచ్చింది మాట.

'అబ్బ ... ఎంత చలివేస్తుందో!' అనుకుంటూ లేచి ఓ వారగా పీట చెక్క మూతపెట్టి ఉన్న కుండ లోంచి ఓ సిల్వరు గ్లాసెడు నీళ్లు తెచ్చి మూతి దగ్గరగా పెట్టాడు రాము. తీరా నీళ్లు తాగబోతే పళ్లు జివ్వుమని లాగేస్తున్నాయి. ఓ గుక్కెడు తాగి కింద పెట్టేసి లేచింది సుమతి. అది చూసి రాము నవ్వాడు.

"ఆకలి ..." కృష్ణ ఏడుస్తూ అన్నాడు.

"నిన్నటి రొట్టె లున్నాయి తింటావా, బాబూ?"

ఈ పంచభక్ష్య పరమాన్నాలూ నీకోసమే. తినమ్మా అన్నంత ప్రేమగా జుత్తులోకి వేళ్లు పోనిచ్చి నిమురుతూ అడిగింది సుమతి.

"ఆ వెధవ తోలు రొట్టెలు నాకొద్దు. అన్నం కావాలి" అని ఉదయమంతా గొడవ చేసిన కృష్ణ "ఊఁ" అనేశాడు అప్రయత్నంగా.

కర్ర పెట్టె తెరిచి ప్లాస్టిక్ పళ్లెం తీసి ఒక అల్యూమినియం గిన్నెలో ఉన్న కొయ్యముక్కల్లాంటి చల్లటి రొట్టెలు చేత్తో పట్టుకొని వచ్చి "తీసుకో" అంది, బలవంతాన ఇస్తే నాకు పాపం వస్తుంది, నువ్వు తినగలిగితేనే తీసుకో అన్నట్టుగా.

కృష్ణ కుక్కలా కలియబడి లాక్కుని కుక్కిన నోట్లో పెట్టేసుకున్నాడు. కాని, నమల్లేక, మింగలేక సతమత మయిపోతూంటే చూసి సహించలేకపోయింది సుమతి.

ఏదో పని ఉన్నట్టుగా పక్కకి తిరిగిపోయి ఉన్న ఓ గ్లాసెడు మజ్జిగలో మరి రెండు గ్లాసుల నీళ్లు కలిసి ఇంత ఉప్పు వేసి పట్టుకొచ్చింది చాలా ఆలస్యంచేసి, అప్పటికైనా ఆ పీక్కుతినే అవస్థ చూడటం తప్పుతుందేమోనని. కాని, కృష్ణ చేత్తో కొయ్యముక్కలా రొట్టె పట్టుకునే మంచాన్నానుకుని నిద్రపోతున్నాడు—

"అమ్మా, నే నెంత మంచి మజా చేస్తానో చూడు" అంటూ సుమతి చేతుల్లో గ్లాసు అందుకుని రెండు రొట్టెలు చిన్న చిన్న ముక్కలు చేసి అందులో వేశాడు రాము.

అవి నానే వరకు గ్లాసులోనే రాము కళ్లు ఉన్నాయి.

రాము మీదే సుమతి కళ్లు ఉన్నాయి.

"ఇప్పుడు ఇంచక్కా తినవచ్చు." సంబరంగా ఓ ముక్క నోట్లో వేసుకుని, "భలే ... భలే ... ఎంత బాగున్నాయో ... నువ్వూ తినమ్మా" అంటూ ఓ ముక్క సుమతి నోటి కందించాడు.

నానిపోయిన అట్టలాంటి రొట్టె ముక్క కంపు కొడుతున్నా నిర్మలంగా ఉన్న రాము ముఖాన్ని, అందిస్తున్న చిన్నారి చేతిని చూస్తూ ఆనందంగా నమిలి మింగేసింది.

మరి కాసేపటికి అడుగు ముక్క లింకా బాగా నాని పోయాయి.

"దుప్పటి కప్పమ్మా. నిద్దరొస్తోంది." మంచం ఎక్కిపోయాడు రాము వాలుకళ్లతో.

చీర గుడ్డ కప్పినా దర్జాగా రాము దాన్ని 'దుప్పటి' అనే అంటాడు.

ఎందుకో ఆనందించింది సుమతి.



నీ కంటిలో వేప

చిత్రం— ఆర్. వి. ఆనందరావు ( మద్రాసు – 26 )

కృష్ణను తీసి సరిగా మంచం మీద పడుకోబెడదా మనుకుంటే దెయ్యం పట్టిన వాడిలా లేచి "ఆకలి!" అని పెద్ద కేక వేశాడు.

మళ్లా రొట్టె పేరెత్తితే చూడ్డానికి మాత్రం ఉన్నా ఏం చేస్తాడోనని భయపడింది సుమతి. అందుకే కృష్ణకు కనిపించకుండా గ్లాసులో నాని ఉన్న రొట్టె ముక్కల్ని మెల్లగా అరిచేతిలోకి తీసుకుని పిసికేసి రెండో గ్లాసులో మజ్జిగతో తొల్లించేసి "తాగు" అంటూ మూతి దగ్గర ఆనించి పెట్టింది బలంగా, బలవంతాన పిల్లల చేత ఆముదం తాగించినట్టుగా.

గడగడ తాగేశాడు కృష్ణ.

"ఎలా ఉంది?" భయపడుతూనే అడక్కుండా ఉండలేకపోయింది.

"బాగుంది." ముద్ద మాటలా పలుకుతూ అన్న పక్కన చేరిపోయాడు.

చీర ఇద్దరి మీదనుంచీ కప్పి ఒక్కసారి ఊపిరి తీసుకుని కూచోబోతూంటే ఉయ్యాల్లో పాప కేరుమంది.

'కృష్ణ అయితే ఆకలి, ఆకలి అంటాడు. ఆ పసిదానికింకా మాటలు రావు... నయమే ఇప్పటి వరకూ' అనుకుంటూ లేచి పాపను తీసి ఒళ్లో వేసుకుని అలవాటు ప్రకారం బట్ట భుజం నిండుగా కప్పుకుంది.

ఆశగా ... ఆబగా పాలు తాగటానికి ప్రయత్నించి కడుపులో పడ్డ నాలుగు చుక్కలూ మరింత మంట పెడుతూంటే ... 'ఇంకా ఎందుకొచ్చిన శిక్ష' అన్నట్టు చిదరగా కొంగులోంచి ముఖం బయట పెట్టేసి కాసేపు ఏడ్చి ఏడ్చి ఊరుకుంది పాప.

మళ్లా గుడ్డ ఉయ్యాల్లో పడేసి అలవాటు చొప్పున

ప్రపంచం... ఈ బంధువులు ... బంధాలు ... డబ్బు... పేరు...ప్రతిష్ఠ...

"కిశోర్! నాకు నువ్వు ... నీకు నేను ... చాలు ... మన కెవరూ వద్దు. ఈ లోకంతో సంబంధం వద్దు... అన్నీ కాసేపు మరిచిపోదాం" అంది గుండెల మీద తల పెట్టుకుని.

"ఆ ఆ ... ఏమన్నావ్? నాకు నువ్వూ, నీకు నేనేనా... ఊహూ ... అలా వీల్లేదు ... నాకు నీలాంటి పాప కావాలి." నవ్వాడు సిగ్గుతో చితికిపోతూన్న తనను మరింత ఉక్కిరి బిక్కిరి చేసేస్తూ.

• • •

"అమ్మా!" అంటూ లేచాడు రాము.

ఉలిక్కిపడి వెళ్లి, గుండెల మీద చెయ్యి వేసి రాస్తూ "ఏం నాన్నా ... భయపడ్డావా? నే నిక్కడే ఉన్నాగా... పడుకో" అంది రెండో చేత్తో తలమీద రాస్తూ.

పెరటిలో గభిల్లుమంటూ గుండె అదిరే చప్పుడు. పటపట మని ఏదో విరుగుతూన్న శబ్దం. కాకు లరుస్తున్నాయి. ఆకాశం ఏడుస్తూంది.

"అమ్మా ... పెరట్లో వేపచెట్టు పడిపోయిందేమోనే... నాకు భయంగా ఉంది."

"చెట్టేగా ... భయంలేదులే" అంది, చెట్టుకంటే దిట్టమైనదా ఈ గుడిసె ఏమవుతుందోనని భీతిగా చూరుకేసి చూస్తూ.

"అమ్మా, దానిమీద ముద్దొచ్చే కాకిపిల్లలున్నాయే. పాపం, ఎర్రని చిన్న నోళ్లతో... చచ్చిపోతా యేమిటో... లోపలికి తెచ్చేద్దామా..." ఏడుపు కంఠంతో అన్నాడు.

"అమ్మో! ఇప్పుడు బయటికి వెళ్లడమే! తెల్లవార్లున్న వరకూ బతికుంటే వెళ్లి తెద్దాములే... పడుకో, మంచి వాడివి కదూ?" రాము ఏమైనా అంటాడేమోనని విశితంగా చూసింది.

'ఎవరు బతికుంటే? కాకిపిల్లలా? మనమా?' అని అడగలేదు రాము.

కప్పిన చీరగుడ్డ తన్నేసుకుని లేచిపోయి మంచం దగ్గరగా నేలమీద కూర్చున్న సుమతి కంఠం చుట్టూ చేతులు పెనవేసుకుని "అమ్మా ... మరి ... మరి ... ఇంత వానలో నాన్నెలా ఉన్నారో!" అని ఏడుపు వణచి పెట్టుకుని అడిగాడు — ఏడిస్తే 'ఛ ... ఛ ... రాము ఆడపిల్లయి పోయాడు' అని సుమతి ఉడికిస్తుందన్న ఎప్పటి జంకుతో.

సుమతి హృదయం మీద బలంగా సుత్తితో మోదినట్లయింది. రాము తల మీద ఓ చెయ్యి, వీపుమీద ఓ చెయ్యి వేసి నిమురుతూ అంది:

"నాన్నకేం? దర్జాగా ఉంటారు ... ఎంత ప్రళయం వచ్చినా ఆ గోడలు మటుకు కూలవు, బాబూ... అవి ఇనప గోడలు ... ఉక్కు కప్పు ... దానిలో ఉన్నవాళ్లు చచ్చిపోయినా అవి మటుకు కూలవు, నాయనా... చాలా దిట్టమైన భవనా లవి, తెలుసా?"

సుమతికి ఆ బీభత్స వాతావరణంలో తన నవ్వు తనకే భయంగా వినిపించింది.

"అమ్మా, మరి మనం కూడా అక్కడి కెందుకు వెళిపోకూడదు?"

"వద్దు, బాబూ ... తప్పు ... అలా అనకు ... మనం వెళ్లకూడ దక్కడికి. నువ్వింకెప్పుడూ ఇలా అనకు." ఎవరో తరుముకొస్తూంటే పరుగు పెడుతూన్నట్లుంది సుమతి కంఠం.

"అమ్మా, పోలీసు లన లెందుకు నాన్నని తీసుకెళ్లేరు?"

"గొప్ప పనులు చేసిన వాళ్ల నలా తీసుకెళతారు."

"మరి నేనూ నాన్నంత గొప్పవాణ్ణయితే ఇంచక్కా తీసుకెళ్లి అలాంటి దిట్టమైన మేడలో ఉంచుతారా? మనమందరం కూడా ఎందు కలాంటి గొప్ప పనులు చెయ్యకూడదమ్మా?"

"రాముా! ... బాబూ ... నువ్వూ అలాంటి పనులే చేస్తావా ... వద్దు, నాన్నా ... నన్ను బాధ పెట్టకురా... పడుకో ... ఇంకేం చెయ్యమన్నా చేస్తాను ... కథ చెప్పేదా? పాట పాడేదా? చెప్పు, తండ్రీ ..."

"అమ్మా ... రేపు మనం తినడాని కేమిటుందే?" ఆ చిన్న మెదడులో రేపటి తిండి గొడవే దొలిచేస్తూంటే కథ, పాట వినే శక్తి మాత్రం ఏదీ? !

"రాత్రిపూట తిండి సంగతెత్తితే దయ్యా లొస్తాయని చెప్పనా?" "అవునమ్మోయ్!" భయంగా మంచం మీద వాలిపోయి చీర తల మీదనుంచి కప్పేసుకున్నాడు.

'నయమే. రాము కింకా దయ్యాలంటే భయం ఉంది. వాడూ గొప్ప పనులు చేస్తా నంటున్నాడు... అమ్మో! అవును మరి ... పోలిక లెక్కడికి పోతాయి? అచ్చుగుద్దినట్లు వాడు శ్రీరామే...'

కొడిగట్టి గుడ్డిగా వెలుగుతూన్న బుడ్డిదీపం ఆరిపోతుందేమోనని రెండు చేతులూ అడ్డుగా పెట్టింది. 'ఇదేమిటి, ఈ దీపంలో శ్రీరామ్ రూపమే కనిపిస్తూంది!'

బయట వీస్తూన్న ఝంఝామారుతానికి గుడిసె అటూ ఇటూ ఊగిపోతూన్నట్టుంది. సుమతి మనసు కూడా ఆ గుడిసె లాగే ఊగిపోతూ, గాలిలా పరుగులు పెడుతూంది.

• • •

ఆ రోజు ... ఆ రోజు ... అదే విసురుగాలి ... సన్నని జల్లు ... కేర్ మంటూన్న చంటి గుడ్డుని అడ్డాల్లో వేసుకుని, చలిగాలి తగలకుండా తలనిండుగా ముసుగు కప్పుకుని, దీపంకేసే చూస్తూ కూచుంది తను — తన కళ్ల వెలుగు కిశోర్ ఎప్పటికి వస్తాడా అని ఎదురుచూస్తూ.

"అదేం మగాడమ్మా! తొలి బిడ్డ పుట్టిందంటే ఉరుకు పరుగులతో వచ్చి పడతాడు తండ్రన్న వాడు. ఇదేం చోద్యం... ఆరు రోజులయినా, అజా పజా లేదు... ఏమయి పోతావో నన్న బెంగైనా లేని మగాడిని ఎంత ప్రేమించి పెళ్లి చేసుకున్నావో కాని..."

రాత్రనక, పగలనక తనకు సర్వ సేవలూ చేసిన పక్కింటి తల్లిలాంటి ఇల్లాలు చనువుగా కిశోర్ని చివాట్లేస్తూంటే సిగ్గుతో తన ముఖం కందగడ్డలా అయింది.

కిర్రుమంటూ తలుపు తెరుచుకుంది.

"మాటలోనే వచ్చావయ్యా ... వెయ్యేళ్లాయుష్షు.. ఇప్పటికేనా ఇల్లూ, పెళ్లాం గుర్తొచ్చారు ... నయమే. నే వస్తానమ్మా." వెళ్లిపోయిం దామె.

తను కిశోర్ ముఖం చూడలేదు.

పది రోజుల కిందట — ఆ రోజు — 'శ్రీరామ్ కేసు తీర్పు ఈవేళ. వెళ్లొస్తా'నని వెళ్లిన పెద్ద మనిషి — తన ఆత్రం, ఆరాటం, ఆరోగ్యం పట్టించు

### రహస్యాలు

పురుషుడు తనకన్న ఇతరుల రహస్యాలు దాచిపెట్టడానికి ప్రయత్నిస్తాడు. స్త్రీ తన రహస్యాలు భద్రంగా దాచుకొని, ఇతరుల రహస్యాలు బహిర్గతం చేస్తుంది.

—బ్రుయేర్

కోకుండా పోయినదే పోకయిపోయి, ఇప్పుడు తిరిగి వస్తే — తను న లెందుకు పలకరించాలి?

శ్రీరామ్ సంగతి తెలుసుకోవాలని ఓ పక్క తహతహ లాడుతూంది మనసు ... అంతేకాదు... అలా తను అలిగిన సమయాల్లో కిశోర్ తనను ప్రసన్నం చేసుకుందుకు ఆడే లాలిత్యమైన మాటలు వినాలని ఓ పక్క కుతూహలంగా కూడా ఉంది. నిజంగా తనకయితే, కిశోర్ తన తప్పు ఒప్పుకుని, బుజ్జగించేవరకూ మాట లాడకూడదని మహా పట్టుదలగానూ ఉంది.

"ఊఁ ... అదంతా నా మీద కోపమేనా? అబ్బ... నన్నెందు కింకా బాధపెడతావ్, రతీ!"

తన కళ్లకు మరీ అందంగా కనుపించినప్పుడు 'రతీ' అనే పిలుస్తాడు కిశోర్. అంటే 'ఫరవాలేదు ... చాలా నిండుగా ఉన్నాడు మనిషి!'

'ఏం పలకరింపు! మీదుమిక్కిలి బాధ పెడుతున్నానని కూడాను!' కోపం తెచ్చి పెట్టుకుని ఎర్రగా చూసి మళ్లా ముఖం పక్కకు తిప్పేసుకుంది.

"ప్లీజ్ ... మాటాడవూ! క్షమించ మంటున్నాడుగా భక్తుడు... కరుణించు, దేవీ ..."

మల్లెల వర్షం లాంటి మాటలు ఇంకా వినాలనే ఉంది. చంటిపాపలా కిశోర్ని హృదయానికి హత్తుకోవాలన్న బలమైన కోరిక నణుచుకోవటం కష్టంగానే ఉంది... కిశోర్ చెవిలో ఎన్నో తియ్యనైన కబుర్లు చెప్పాలన్న ఉబలాటం ఉరక లేస్తూంటే పెదిమలు బిగించుకు కూర్చోవటం మహా యాతనగానే ఉంది.

"ఆలోచిస్తున్నావా? ఏమిటబ్బా అంత ఆలోచన! మన బుజ్జినాన్న కేం పేరు పెడదామనా ..."

'ఏమి టా కవ్వింపు...అన్నీ దొంగ వేషాలు ... తనకి తెలియదూ!' "ఇంత కోపం ఇదివర కెప్పుడూ చూడలేదే...రతీ...ఒక్కసారి కళ్లెత్తి చూడవ్."

బలవంతంగా తన ముఖాన్ని దోసిట్లోకి తీసుకుంటూంటే ఎలా నిగ్రహించుకుందో గాని తను...

"ఏం పేరో నే చెబుతాగా!"

తనకు ఇంకా ఉడుకుమోత్తనం వచ్చేసింది.

"చాల్లే ... దూరంగా వెళ్లు ... పేరు పెట్టాలని వచ్చావన్న మాట! తగుదునమ్మా అని... నువ్వొద్దు... నీ పేరూ వద్దు" అని కసరగలిగి నందుకయితే సంతోషించింది కాని, తన ఒడిలోని బిడ్డను కిశోర్ ఆప్యాయంగా రెండు చేతులా తీసి గుండెలకు హత్తుకుంటూంటే వారించలేక పోయినందుకు ఓడిపోయినట్లుగా పెట్టేసింది ముఖం.

"నేను అక్కరలేకపోయినా — ఈ పేరుమాత్రం వద్దనకు, సుమతీ ... ఇదుగో ... వీడి పేరేమిటో తెలుసా?"

ఉక్రోషంగా చూసింది తను కళ్లు విప్పార్చి.

## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# పరీధావి దీపావళి కథల పోటీ

ప్రతి సంవత్సరంవలెనే ఈ పరీధావి దీపావళి సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తూంది.

విరోధికృత్ దీపావళి కథల పోటీలో 5,000 రూపాయల బహుమతులు అందజేశాము. రచయితలకు, రచయిత్రులకు ప్రోత్సాహం కలిగించాలనే సంకల్పంతో ఈ సంవత్సరం కూడా దీపావళి కథల పోటీలో మొత్తం 5,000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకోవలెననీ, పాఠకులకు ఉత్తమమైన కథలు అందజేయాలనీ, మా కృషి విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలనీ కోరుతున్నాము.

## మొదటి బహుమతి రు. 2,500
## రెండవ బహుమతి రు. 1,800
## మూడవ బహుమతి రు. 700

### దీపావళి కథల పోటీ నిబంధనలు:

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయ రచనలేకావి, అనువాదాలు పంపరాదు.
3. రచన అరఠావు 12×8 అంగుళాలు సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవానిని ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. పోటీకి పంపిన కథలను ఏ సందర్భంలోను తిప్పి పంపించడం జరగదు.
8. ప్రచురణకు ఏ కలం పేరో ఉపయోగించినా తమ అసలు పేరును విధిగా వ్రాయాలి.
9. రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.

బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము

| | |
|---|---|
| పరీధావి దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | ఆగస్టు 28, 1972 |

"శ్రీ...రా...మ్."

"ఆఁ ... ఆఁ ... ఏమన్నావ్... ఎందు కా పేరు? మన శ్రీరామ్ పేరు ... ఎందుకు ... ఏమయింది తీర్పు .... ఎక్కడ మన శ్రీరామ్?" మతి పోయినట్లుగా ఏమిటేమిటో గబగబా అనేసింది.

కిశోర్ చంటివాడి మూర్థం ముద్దు పెట్టుకుంటూ, ఇడుగో శ్రీరామ్ ... వచ్చేశాడుగా ... ఇంకెందుకు బెంగ?" అంటున్నాడు.

"చెప్పు, కిశోర్... శ్రీరామ్‌ని ఏం చేశారు? వేగం చెప్పు" అతణ్ణి పట్టుకుని వెర్రి బలంతో ఊపేసింది.

"ఉరి తీసేశారు ... సుమతీ ... నా తమ్ముడిని ... ద్రోహిగా, హంతకుడిగా నిరూపించి ... ఉరి తీసేశారు."

పసిపిల్లాడిలా ఏడ్చేస్తూన్న కిశోర్ కన్నీటిధారలు చేతుల్లో ఉన్న పిల్లాడి పొట్టమీద టపటప జారి పడుతున్నాయి.

మెల్లగా లేచి వెళ్ళి కిశోర్ కంఠం కౌగిలించుకుని చెవిలో చెప్పాలనుకున్న తియ్యని గుసగుసలకు బదులుగా అంది:

"తప్పు ... కిశోర్ ... చాలా తప్పు... శ్రీరామ్ చచ్చిపోయా డనకు... అశుభం కదూ... చచ్చిన దేమిటో తెలుసా? క్షీణించిపోయిన న్యాయం ... బక్కచిక్కిన ధర్మం బతకలేక చచ్చిపోయింది... ఈ ధర్మాన్ని పునరుద్ధరించటానికి మహానుభావుడై జన్మించాలని వెళ్ళి ఉంటా డంతే..." ఆ పిచ్చి ధోరణి ఏమిటో తనకే సరిగా గుర్తులేదు.

ఒంటిమీద స్పృహ వచ్చేసరికి మంచంమీదే ఉంది తను. రేగిన జుట్టుతో, పీక్కుపోయిన ముఖంతో మంచానికి తల ఆన్చుకుని నేలమీద చతికిలబడి ఉన్నాడు కిశోర్.

"నాకేదో పీడకల వచ్చిందని చెప్పు, కిశోర్ ... శ్రీరామ్‌కి ఏమీ కాలేదని చెప్పు ..." నెత్తి బాదుకుంది రోదిస్తూ.

భయంకరంగా నవ్వాడు కిశోర్.

"శ్రీరామ్‌కి ఇంక ఏమీ అవదు, సుమతీ ... ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు... వాడన్నిటికీ అతీతుడై పోయాడు... అవును... నాన్న చెప్పినట్టు నడుచుకున్నాడు వాడు ... అన్యాయానికి, అక్రమానికి తల వంచద్దన్న నాన్న ఆదేశాన్ని అక్షరాలా పాటించింది వాడే, సుమతీ ... లాఠీదెబ్బలు తిని ... జైళ్ల పాలయి ... పడరాని పాట్లు పడి అమ్మను దాస్య విముక్తురాలిని చేశాం, బాబూ ... మీ తరం ... ఆ అమ్మ ఆరోగ్యంగా ఉండేలా చూడాలని బోధించిన నాన్న నిజమైన అనుచరుడు వాడు, సుమతీ ... వాడి పట్టుదల ... ఆవేశం... ఆశయాలు . చూస్తోంటే ఎంత గొప్పవాడవుతాడో అనుకున్నాను. తనకు ప్రియతమ మిత్రుడైన భగత్ సింగ్‌ను ఉరితీసిన నాడు 'వీర వర్యుల గోలుపోయిన పేదవని రోదించనా, అట్టి పుత్రుల గన్న నీదే భాగ్యమని గర్వించనా' అంటూ ఎంత ఆవేశపు పొంగుతో నాన్న ఆ గేయాన్ని రాశారో అంత ఆవేశంతోనూ పాడి అందరి కళ్లంట నీరు చిప్పిలజేసిన నా తమ్ముణ్ణి చూచి మైమరిచి పోయాను. అలాంటి వాడికి అన్ననని గర్వించిపోయాను. అహర్నిశలూ కష్టించి పనిచేసయినా సరే, వాడిని మంచి విద్యావంతుణ్ణి చెయ్యాలని సంకల్పించుకున్నాను.

"కాని ... నాకేం తెలుసు ... వాడి ఆవేశమే వాడి

చావు కొనితెస్తుందని ... ఏభై వేల రూపాయల ఖర్చుతో కాలేజీకి కొత్త బిల్డింగు కట్టిన కంట్రాక్టరు పాపారావు ఆ భవనం కూలి ఆరుగురు చచ్చిపోయి, ఎంతోమంది గాయపడ్డారని తెలిసినప్పుడు తన కేమీ సంబంధం లేదన్నట్లుగా ఊరుకుంటే, ఉడుకురక్తంతో పరుగులెడుతూన్న నా తమ్ముణ్ణి నే నాపలేకపోయాను. అంతేకాదు, 'నీ రక్తం కళ్లచూస్తా' నని పాపారావుని బెదిరించాడని తెలిసి, అనవసరమైన గొడవల్లో తల దూర్చవద్దని ముఖం వాచేలా చీవాట్లు పెట్టాను.

"సుమతీ, 'బెదిరించో', దండించో నిజం బయట పెట్టేవాళ్లు లేకపోతే అన్యాయాలు, అక్రమాలు ఇలా కొనసాగుతూనే ఉంటాయని అలా అనవల సొచ్చింది' అన్న వాడిని 'నువ్వు బయట పెట్టే నిజం ఏమి'టని నే నడగకుండా ఉంటానా?

"సుమతీ ... ఆ డబ్బంతా కాజేసింది పాపారావు ఒక్కడు మాత్రమే కాదట ... మీ మామయ్య భుజంగరావు బలం అతని కెంతో దన్నుగా ఉందట... వీడు నలుగురిని కూడేసుకుని వెళ్లి పాపారావుని నిర్బంధించేసరికి భయపడి ... మీ మామయ్య పేరుకూడా బయట పెట్టేశాడట ... ఆ సంగతి తెలిసిన భుజంగరావు పాపారావు దగ్గరి కెళ్లి ఏదో తగువు పడ్డాడట ... ఆ రోజు రాత్రి పాపారావుని ఎవరో చంపేశారు ... తన తెలివితేటలతో ఏదో కనిపెట్టి లోకానికి వెల్లడి చేయాలన్న దృష్టితో అదే సమయానికి అక్కడికి వెళ్లిన శ్రీరామ్ అందరి దృష్టిలోనూ హంతకుడయ్యాడు... సుమతీ ... వాడి మనసు ఎంత సున్నితమో నాకు తెలుసు ... ఒక ప్రాణాన్ని బలి తీసుకొనేంత కఠినత్వం వాడిలో లేదు, సుమతీ ... వాడు చంపలేదు... నువ్వయినా నమ్ము... వాడి ఆత్మశాంతికోసం..." తన చేతులు పట్టుకొని వెర్రిగా ఘోషిస్తున్నాడు కిశోర్.

"నా తమ్ముడి చావుకి ఆ భుజంగరావే కారణం. మీ మామయ్య నా మీద, నీ మీద ఉన్న కసి వాడి మీద తీర్చుకున్నాడు. కొన్నాళ్ల జైలు శిక్షతో పోకుండా ఉరితాడు వేయించింది మీ మామయ్య పదవి బలమే... వాడికి కూడా నవ్యమైన చావు రాదు... చూస్తూండు ... వాడూ కుళ్లి, కుళ్లి చస్తాడు... ఇది నా శాపం ... నా తమ్ముడి చావుని గరళంలా మింగలేక పోతూన్న నా కంఠంలోంచి వస్తూన్న పరమ సత్యం ... నాలోనుంచి ఏ దేవుడో పలుకుతూన్న కటిక నిజం."

భయంతో కంపించిపోయింది తను.

"కిశోర్ ... కిశోర్ ... నీకు పుణ్యముంటుంది ... నువ్వుకూడా అంత ఆవేశంగా మాట్లాడకు ... నాకు భయం వేస్తూంది ... నీ ఆవేశం నన్ను, నీడని బలి తీసుకుంటుందేమోనని ..." వణికిపోతూన్న తనను బలంగా పట్టుకుని మిగిలిన మాటలు బయటికి రానివ్వకుండా నోరు మూసేశాడు.

(సశేషం)

# ఒక రాత్రి

## గుంటూరు శేషేంద్ర శర్మ

ఈ నాటి చంద్రుడ్ని మరిచిపోలేను
ఏ నాటి అర్థాలో ఎదకు తెస్తున్నాడు
ఈ తారలు తోరణాలై నా అనుభూతి పండుగలో
పిల్తొంటున్నాయి,
ఈ గాలి ఏ పూలసందేశాలు మోసికొని వచ్చిందో
ఎప్పుడో ఎక్కడో నేను పారేసుకొన్న
మధుమాసాన్ని గుర్తుకు తెస్తూ ఉంది
ఈ తావులే యెదల వ్యథలు పెనవేసుకుని
వచ్చాయో
ఒకప్పుడు నా అగాధాల్లోకి జారిపోయిన
దేదో లోపల గ్రుచ్చుకుంటూ ఉంది.
జడివెన్నెల వాన జల్లుల్లో తడిసి వచ్చిన
కోర్కెల రెక్కలచప్పుళ్లు
నిశ్శబ్దపు సాలీడు గూళ్లు కట్టుకుంటున్న
నా గుండెల మండువాలో వినబడుతున్నాయి—
కనుగొనల్లో తొంగి చూచిందొక అశ్రువు,
ఒక విధుర విషాద దూతిక, గత జీవిత
ఇంద్రచాపకాంతులు విరజిమ్ముతూ
చెక్కిలిమీదికి అవతరిస్తోంది షోకుగా
అది పోతే పోయింది, ఇన్ని
గుర్తులు విడిచిపోవాలా!
ఒక వేయి పరిమళాలు, వేయి గుసగుసలు
లక్ష రంగులు, ఎంత ఇంద్రజాలం
వెనక మిగిల్చిపోయింది!
అది పోయింది కానీ, కన్నుల్లో నిల్చిపోయింది.
అతి నాజూకుగా ఏదో గీతిక నన్ను చేరుతూ ఉంది,
నఖ శిఖపర్యంతమూ వేయి కోమల హస్తాలతో
స్పృశిస్తూ లాలిస్తూ ఉంది.
మనస్సు వెళ్లిపోయిందెక్కడికో మమతల
పందిళ్లలో మల్లెపూలేరు కునేందుకు
కాలదూరాల తీరాలు విడిచి స్వప్న
అనుభూతిలో జలకాలాడుతూ ఉంది—
వినబడే గీతికంటె గీతి విడిచిపోయిన
తలపుల మెలపుల్లో లోలత హెచ్చు
బాధకంటె బాధ మిగిల్చిన గాథకు పదునెక్కువ
గాయకంటె మచ్చకు గొంతెక్కువ
అనుభూతి కంటె స్మృతి బలీయం
పిలిసీడలు మెదలే తన విశాల నేత్రాలు విప్పి
ఈ రాత్రి నాతో గుసగుసలాడుతూ ఉంది
ఈ రాత్రి ఒక సుందర దృశ్యం మాత్రమే కాదు
సుఖము దుఃఖము అందము ఆనందము
ఆశ విషాదము వేడుక వేదన స్మృతి విస్మృతి
అన్నీ కలిసి తమ జీవరక్తం పిండి
పండించిన ఒక అవ్యక్త మధుర క్షణం
తాకలే నీ రాత్రి భావ మధురిమకు
లొంగిపోతున్నా నాత్మ సరిగమకు
ఇది వన్నిటిలో కడిగిన క్షణం
ఇది గీతికలో తడిసిన రాత్రి. . .

★

# గాలివాన

(క్రిందటి సంచిక తరువాయి)

## 3

ఊపిరి తిరగక కిరకిర చుట్టుకుంటూన్నట్లుగా ఏడుస్తూంది ఉయ్యాల్లో పాప... అదిరిపడి లేచి వెళ్లి, ఎత్తుకుందామని ఒంటిమీద చెయ్యి వేసింది సుమతి.

ఒళ్లు కాలిపోతూంది... గాలికి, వర్షానికి, కొద్దిగా తడిసిన ఉయ్యాల చలివిరికి విపరీతమైన రొంప చేసేసి ఊపిరి తీసుకోవటమే కష్టమైపోతూంది.

ఎంత సముదాయించినా ఊరుకోవడం లేదు. అదే కిశోర్ ఉంటే ఆడించో, బుదిరించో పిల్లలను నిద్ర బుచ్చేవాడు. దీని కాపాటి అదృష్టంకూడా లేదు!

రాత్రి ఎన్నోయామో తెలియదు... ఎటు చూసినా అంధకారం ... ప్రకృతి చేసే బీభత్సకరమైన శబ్దాలు తప్పితే పిలిస్తే 'ఓ' అని పలికే జీవి లేదు. ఎలా తెల్లారుతుంది? ఎప్పటికి తెల్లారుతుంది? వెలుగొచ్చినా ఎక్కడికెళ్లి ఓ పిడికెడు బియ్యం తేగలదు? కనీసం గొడుసుబ్బమ్మ ఇంటి కయినా మైలుదూరం పోతేకాని లాభం లేదు... అంతవరకూ అస లెలా గడవడం?

అప్పటివరకూ గాలి మాత్రమే ఉద్ధతంగా ఉంది. ఒకరాత్రి మంచి వర్షం జోరు కూడా ఎక్కువయింది.

పెరటి గడప దాటుకుని నీరు మెల్లగా లోన ప్రవేశిస్తూంది.

తాచుపాముని చూసినంత భయపడింది సుమతి.

ఆ నీరంతా లోపలికొచ్చేస్తే ఏమవుతుంది? నాని పోయి ఉన్న మట్టి గోడలు ఎప్పుడు దభీమని కూలి పోతాయో ... తన పిల్లలేమయిపోతారో... దేవుడా... ఈ ప్రళయం మాకోసమే తీసుకొచ్చావా, నాయనా... నీకు కనికరం లేదా, తండ్రీ?

తన గొంతుకే కోటి రూపాలు ధరించి, గాలిలో కలిసిపోయి దీనంగా ఆక్రందిస్తూన్నట్లుంది.

పిచ్చివాడేమైనాడో ... ఈ వాడలో నాలుగైదు కుక్కలుండాలి ... ఎక్కడ తలదాచుకున్నాయో ... బళ్లెక్కి వెళ్లిన వాళ్లంతా ఏదో సురక్షిత స్థలానికి చేరుకుని ఉంటారు.

తనను కాకుంటే పిల్లల్నయినా తీసుకెళ్లారు కాదు.

ఈ చంటివాళ్లేం అపకారం చేస్తారని వీళ్లకి!

కిశోర్ వచ్చాక చాలా గట్టిగా చెప్పేయాలి ... హృదయం లేని మనుష్యుల మధ్య ... ఈ వాడలో ఉండనే వద్దు... ఇంకెక్కడికయినా దూరంగా వెళి పోయి హాయిగా బ్రతుకుదామని.

కిశోర్‌ది చిత్రకళలో మంచి అందివేసిన చెయ్యి... కాస్త ఓర్పు ఉండాలి కాని, ఉద్యోగం దొరక్కపోతుందా? ఆ రోజు చక్కగా నిగనిగ మెరిసే ఓ టాక్సీ తెప్పించి పిల్లలూ తనూ మంచి మంచి బట్టలు కట్టుకుని దర్జాగా వెళిపోతూంటే, అప్పుడు తెలిసి రావాలి వీళ్లకి అసలు తనెవరో ... ఏదో అభాడాగా బ్రతికే కులం గోత్రం లేని దిక్కుమాలిన దానిగా నుకుంటున్నారు వీళ్లంతా ... కష్టాలు కలకాలం ఉండవంటారు ... ఆరు నెల లయిపోతూంది ... కిశోర్ వచ్చేయాలిక... మనకు మంచి రోజులు వస్తున్నాయి.

సుమతి ఊహాపథంలో చక్కని చిన్న తోట ... ఆ మధ్య ముద్దొచ్చే చక్కటి ఇల్లు ... అందులో చిలకా గోరింకల్లా తనూ, కిశోరూ ... కాన్వెంటు డ్రెస్సుల్లో బూట్లు కటకటలాడించుకుంటూ పరుగులెడుతూన్న రాముా, కృష్ణా. సరదాగా చప్పట్లు చరుస్తూ కేరుతూన్న పాప ... ఆనంద లోకాల్లో విహరిస్తూన్న తనను 'రతీ!' అంటూ అల్లరి పెడుతూ, గడిచిన పీడకలలను మరిచిపోయి నిండుగా నవ్వుతూన్న కిశోరూ — ఇదంతా ఏదో హాయిగా అనిపిస్తూంది.

హఠాత్తుగా ఏదో దఢ్ దఢ్ మంటూన్న శబ్దం. గుడిసెమీా దేదో పడిపోతూంది... చెవుల్లో కందిరీగలా రొదపెడుతూంది పాప. భుజం మీద పిల్లను మెడ దగ్గరగా నొక్కి పట్టుకునే చెవులు మూసుకుంది భయంగా... గుమ్మడికాయలతో వేళ్లాడుతూన్న మామిడికొమ్మ అయి ఉండచ్చు ... అదేదో గుడిసె మీదపడింది ... ఆ తీదడుకి పెరటివైపు మట్టిగోడ మెత్తగా నాని ఉందేమో జవజవలాడుతూ జారి పోతూన్నట్లుంది.

'ఏందారి, దేవుడా...పిల్లల్ని తీసుకుని వీథిలోకి పారి పోవాలి... లేకుంటే ఉన్నపాటున చస్తారంతా... తడిసినా ఫరవాలేదు.' గబగబా వెళ్లి కప్పిన చీరగుడ్డ లాగేసింది.

"రాముా ... బాబూ ... లేవండమ్మా ... ఇల్లు కూలిపోయింది. బయటికి పారిపోవాలి ... లేవండి..."

ఊహూఁ, ఎంత కుదిపినా ఇద్దరూ మరింత ముడుచుకుని పడుకున్నారు. గోడ అలా పెల్లలు పెల్లలుగా రాలుతూనే ఉంది. ఉండి ఉండి మిన్ను విరిగి మీద పడ్డట్లుగా ఆ పంచ ఉన్నపాటున నేల కొరిగి పోయింది.

'ఆఖరు క్షణాలివి' అనుకుంటూ మూసేసుకున్న కళ్లు తెరిచి చూడబోయేసరికి పక్కకి ఒరిగిపోయిన పంచ ... బురద నీటిలో అప్పడాల్లా తేలుతూన్న సిల్వర్ పళ్లాలూ కనిపించాయి.

'ఏం ప్రమాదం జరగలేదు ... నయమే ... అయినా తను మరీ ఇంతగా వణికిపోతే ఎలా ... పంచ జారిందంతే ... ఇలా పంచ జారిన ఇల్లు మరింత దిట్టంగా ఉంటుందట. ఈ వాడ చివర ముష్టెత్తుకునే తాత ఇలాంటి ఇంట్లోనే అయిదేళ్ల నుంచి ఉంటున్నాడట ... కాని, ఈ పిల్లలేం పిల్లలసలు... తీరా లేప బోతే లేచారే కారు ... అయినా అదీ మంచిదేలే ... ఈ అపరాత్రి పూట లేచి మళ్లా ఆకలి అంటే ఏం పెట్టడం? అసలే రెండు రోజులుగా మాడిపోతూన్న కడుపులు...'

మంచం పట్టెమీద ఓరగా కూచుని కాళ్లు రెండూ పొడుగ్గా పెట్టె మీదకు చాచి కాళ్లలో పాపను వేసి చిన్నగా కుదుపుతూంది. పాలిపోయిన బక్కచిక్కిన ప్లాస్టిక్ బొమ్మలాంటి పాప అప్పటికి కాస్త ఊపిరి తిప్పుకోగలిగి నిద్రలోకి జారుకుంది మరలా.

'పాపకి రక్తం లేదు... పాలు లేవు... పిల్లలకు తిండి లేదు. తనకు లేవటానికి శక్తి లేదు... ఏం చెయ్యాలి... కిశోర్ వచ్చేవరకూ కనీసం బ్రతికయినా ఉండాలిగా ... ఎలా? ప్రాణాలెలా కాపాడుకోవాలి? అంతే ... అదే పరయిన తోవ.'

సుమతి మెదడులో తళుక్కున ఓ మెరుపు మెరిసింది.

'తెల్లారగానే లేచి ముందు గొడు సుబ్బమ్మ ఇంటి కెళ్లాలి... దర్జాగా మెక్కి మెత్తని పక్కమీద మెప్పుగా పడుకుని ఉంటుంది... మేం చావడానికి సిద్ధమై పోతున్నాం ... తినేదాని కేమైనా పెట్టు అని ఘోష పెట్టాలి ... పరమ పిసినారి సుబ్బమ్మ ... ఏమీ ఇవ్వదు... అప్పుడు ... పక్కనున్న కర్రో, కత్తో తీసుకుని ఒక్కపెట్టు పెట్టేసి ఇంట్లో తినే వస్తువు లేవుంటే అవి ఎత్తుకు రావాలి...

'సుబ్బమ్మ ... ఇంతదెలా అయింది? పాల వ్యాపారం పేరుతో నీళ్ల వ్యాపారం చేసి ప్రజల్ని నిలువునా దోచేసి, రూపాయికి అర్ధాలు వడ్డీతో రక్తమాంసాలు పీల్చేసి దానితో కట్టిం దీ పీటచెక్కలాంటి డాబా ... తన నగలన్నీ దాని దగ్గరే ఉన్నాయి... తాకట్లు నాకట్టుంయి పోయిందంటూ తనని శుద్ధ పకీరుని చేసేసింది... దాన్నేం చేసినా పాపం లేదు. దాని పీక తెగనరికేసి — తను బ్రతికే మార్గం చూసుకోవాలి...

'ఏమిటీ ఆలోచనలు?' తనలోనే అనుమకుంది సుమతి.

'ఈవేళేమయింది తనకి? ఇలాంటి ఊహాలు పుట్టు కొస్తున్నాయేం?' భయంగా చుట్టూ చూసింది.

మట్టి గోడమీద బుడ్డి దీపం గుడ్డి వెలుగులో తన నీడ భూతంలా ఉంది... దానిలోంచి వెక్కిరింపుగా వ్యంగ్యంగా వినిపిస్తూంది కిశోర్ కంఠం.

"సుమతీ... అదే, సుమతీ ... అదే విప్లవమంటే ... అది నిప్పు ... అలా కాల్చుకుంటూ వెళుతుంది ... అది అంటురోగం ... ఆకలి రోగం. చూశావా ... ఒక నాటికి నువ్వూ ఆ రోగానికి లోబడక తప్పదని చెప్పాను... వచ్చేశావు దారిలోకి ... రా రా ... చేయీ చేయీ కలిపి ఆ దారిలో ప్రయాణం చేద్దాం ... అహ్హహ్హహ్హా!" కిశోర్ గొంతు ఆగకుండా వికటాట్టహాసం చేస్తూంది. విప్లవం ... విప్లవం ... విప్లవం ... అని ఆ నవ్వులోంచి వింతగా ప్రత్యేక ధ్వని వినిపిస్తూంది...

"అబ్బబ్బ ... విప్లవం ... విప్లవం ... విప్లవం ... ఆ మాటలతో నన్ను కాల్చేయవద్దని ఎన్నిసార్లు చెప్పాను?" గట్టిగా అరిచింది సుమతి.

'ఎదురుగా తన నీడే ... తనకి పిచ్చెత్తుతూందా?

'అయ్యో, కిశోర్! ఎలాంటి వాడివి ఎలా తయారయ్యావు ... తమ్ముడిని నిలదీసి దండించిన నాటి పిలోని విగ్రహం ఏ గంగలో కొట్టుకుపోయింది?'

సుమతి మెదడు రెండు సంవత్సరాల ముందుకి పోయింది.

* * *

కిశోర్‌కి ఎక్కడా నిలకడైన ఉద్యోగం దొరకలేదు.



—ఎ. శ్యామలారాణి

హత్యానేరంపై ఉరితీయబడ్డ శ్రీరామ్‌కి తను అన్న అని తెలిసిన తక్షణం ఏదో ఒక పేరు పెట్టి అతణ్ణి పనిలోంచి తీసివేస్తున్నారు. ఈ వాటివాని తలుపు రాళ్ళు తెప్పిపెట్టే ఉద్యోగాలతోటి, ఇంటర్వ్యూల తోటి కావలసినంతగా విసిగిపోయి ఉన్నాడు కిశోర్.

ఆ రోజు— తన బలవంతం మీద ఇంటర్వ్యూకి వెళ్ళడానికి ఎలాగో సిద్ధపడ్డాడు. తను కొత్త షర్టు, పాంటు తెచ్చి కిశోర్ ఎదురుగా బల్లమీద పెట్టింది.

"ఎక్కడివి ఇవి?" ఆశ్చర్యపోతున్నాడు.

"కొన్నవి." కావాలని చాలా కొంటెగా అంది తను.

"ఎలా కొన్నావ్, సుమతి... నీ ఒంటి మీద వున్న ఒక్కొక్క నగ నా చేతులతోనే తాకట్టు పెట్టేశావే... అమ్మేశావే... నన్ను ఏరి కోరి చేసుకున్నందుకు నీలాంటి అమాయకురాళ్ళందరికీ కనువిప్పు కలిగేలా చేశావే ... ఎలా వచ్చాయివి?" అంటూ మాటిగా తన మెడకేసి చూసి, చప్పున మెడలో తాడు బయటికి లాగి, "ఏవీ మంగళసూత్రాలు?" అని గద్దించినట్లే అన్నాడు.

"అమ్మేశాను." పెంకెగా చెప్పింది.

"ఏమిటే చివరికి ..." ఆవేశంలో పిడికిళ్ళు బిగించి బల్లకేసి గట్టిగా గుద్దాడు. అతని ఆవేశం ఎలా చల్లారుతుందో తనకి బాగా తెలుసు ... "కిశోర్!" అంటూ పెనవేసుకున్న తనను అతను విదిలించలేదు.

"మన మాన మర్యాదల్ని కాపాడలేని మంగళసూత్రాలెందుకు చెప్పు... నేనెంతో ప్రేమగా కొని తెచ్చా ఇవి... సంతోషంగా కట్టుకుని వెళితే తప్పక ప్రసాదంగా నీకు ఉద్యోగం వస్తుంది... అప్పుడు నే చెప్పిన నగలైనా చేయించుకుంటాము... నువ్వింక ఏమి ఎదురు చెప్పినా నీ రతీదేవికి చాలా కోపం వస్తుంది... ప్లీజ్!" అంటూ కిశోర్ని పసివాడిని చేసెయ్యటం తనకే చేతనవును.

తల్లికి భయపడ్డ చిన్న కుర్రాడిలాగే కొత్త బట్టలు కట్టేసుకుని ఉద్ధరిస్తున్నట్లుగా చూస్తున్నాడు. తల దువ్వి, కాలరు సర్దుతూ "టైమవుతూంది మరి" అని చక్కిలిగిలి చేసి తొందర పెట్టింది తను.

**ఇంకా పొడుగు ఎదగండి**
3" — 8"

నూతన శాస్త్ర పద్ధతులతో వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి. ఆరోగ్యవంతులవండి. స్త్రీ పురుషులకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంతమాత్రం లేదు. వివరములు ఇంగ్లీషులో గాని తెలుగులో గాని ఉచితం.
**TOTAL HEALTH,**
**283, Azad Market (AVP), Delhi-6.**

అనన్య సామాన్య ప్రచారంగల
తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# కాయకల్ప చికిత్స

హృదయము, ఊపిరితిత్తులు, పైత్యకోశము పూర్తిగా శిథిలము కాకుంటె, రోగి తిరిగే స్థితిలో వుంటె, యీ చికిత్స పొంద వచ్చును. 3 లేక 4 మాసములలో యీ చికిత్సవల్ల దేహములో వున్న అన్ని వ్యాధులు నివారణ మగుటయే గాక, సగము వయస్సు కలిసి వచ్చును. అనగా 60 సంవత్సరములవారు యీ చికిత్స పొందిన 30 సంవత్సరముల ప్రాయములో వారికి వున్న యవ్వనము కలుగును. ఇంగ్లీషు, ఆయుర్వేద, యునాని, హోమియోపతి, ప్రకృతి వైద్యములవల్ల సాధ్యముకాని అన్ని వ్యాధులు నివారణమగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 2-00 M.O.పంపవలయును.

**శ్రీ యోగాశ్రమము**
**పెదవాల్తేరు పోస్టు,**
**విశాఖపట్టణము - 3.**

గుమ్మం దాటబోతూన్న కిశోర్ మళ్ళా రెండడుగులు వెనక్కి వేసి, "ఈ ఉద్యోగం తప్పకుండా వస్తుందని నీకు నమ్మకంగా ఉందా?" అన్నాడు. ఎంతో జాలివేసేలా ఉంది ఆ కంఠం.

"ష్యూర్ ... వచ్చి తీరుతుంది." కిశోర్ చేతిని అదిమి పట్టుకుని చాలా దమ్ముగా అంది తను.

చాలా రోజుల తరవాత కొత్త బట్టలు వేసుకుని దర్జాగా వెళుతూన్న కిశోర్‌ని కనుమరుగయ్యేవరకూ చూసింది... అతను తెచ్చిన మొదటి జీతంలో అత్యవసరంగా ఏమేమి కొనాలో పెద్ద లిస్టు తయారుచేసుకుంది. "నాకో బుల్లి కారు" అన్నాడు మధ్యలో రాము. "ఆహా... అది రెండో నెలలో ..." చాలా సీరియస్‌గా చెప్పేసింది.

ఎన్నెన్నో కలలు కనగా, ఎంతగానో ఎదురుచూడగా వచ్చాడు కిశోర్ ... కాని, ఎలా! నుదుట గాయం... కొత్త బట్టల నిండా రక్తపు మరకలు ... మనిషిని చంపుకుతిన్న పులిలా చూస్తున్నాడు.

"అమ్మో! గాయం ... రక్తం ... కిశోర్. ఏమిటిదంతా?" వణికిపోతూ అతని రెండు చేతులూ పట్టుకుంది.

"రక్తం కాదు... విప్లవ తిలకం ..." కిశోర్ నవ్వుతున్నాడు. అదిరిపడి పట్టుకున్న చేతుల్ని వదిలేసి దూరంగా జరిగింది తను.

'కొంపతీసి ... ఏం చెయ్యలేదు కదా ... ఇదివరకే అన్నాడు — "సుమతి, నాకు ఉద్యోగం వస్తుందని, వచ్చినా నిలకడగా ఉంటుందని నమ్మకం లేదు. ఎందుచేతంటే, నా కిప్పుడు హత్యచేసి ఉరికంబ మెక్కాడనిపించుకున్న శ్రీరామ్ అన్నగా తప్ప అర్టిస్టు కిశోర్‌గా గుర్తింపు లేదు. ఇంటర్వ్యూ చేసే వాళ్ళు నన్ను వేసే ప్రశ్నలలో ముఖ్యమైన దదొకటి. ఉద్యోగం రాదేమోనని భయపడి నా మనసుని నేను మోసగించుకోలేను. శ్రీరామ్ నిరపరాధి అని, అతణ్ణి అన్యాయంగా చంపారని నాకున్న కసి వెళ్ళగక్కకుండా ఉండలేను. నే నిప్పటికే ఎంత విసిగిపోయానో నీకు తెలియదు, సుమతి ,.. ఇకపై నెవరైనా మళ్ళా ఇంటర్వ్యూలో ఈ విషయం కదిపితే ఏం చేస్తానో ..."

"కిశోర్! ప్లీజ్ ... అలా అనకు ... సంసారికి సహనం కావాలి. నా ముఖం, ఈ పిల్లల ముఖం చూసయినా సరే నువ్వు నిగ్రహించుకోక తప్పదు."

అలాగా ఎన్నో విధాల బతిమాలి బోధపరిచింది. ఆ రోజు ఇంటర్వ్యూకి బలవంతాన పంపించింది.

కిశోర్ అంటున్నాడు:

"ఇంటర్వ్యూ చేసిన వాడి కీ సారి తగినట్టు బుద్ధి చెప్పాను."

"అమ్మో!" గావుకేకేసింది తను.

"అతను ఆఫీసరు హోదాలో నన్ను మెడపెట్టి బయటికి గెంట మన్నాడు."

" హే ... భగవాన్!"

"అంతసేపూ లోపల జరిగిన రంధి అంతా విని మఠం వేసుకుని బుద్ధిగా కూచోవడానికి, బయట కూచున్న వాళ్ళంతా కళ్ళు మూసుకుని చప్పట్లు కొట్టే రాంభజన మేళం కాదని అతనికి తెలియ జెప్పారు... ఆఫీసరు రూము తలుపులు విరిగాయి... ఫర్నిచరు విరిగి కాలి ఝామ్మని మంట లేచింది...ఆఫీసరు బతికి బయట పడతాడనుకోలేదు... పోలీసు లొచ్చారు.... లాఠీఛార్జి జరిగింది ... దొరికిన వాళ్ళని అరెస్టుచేసి తీసుకుపోయారు... ఎలాగో నేను ప్రాణాలతో ..."

వెక్కివెక్కి ఏడుస్తూన్న తనను అప్పటికి చూశాడు కాబోలు— చెప్పడం ఆపేశాడు.

ఆ రోజంతా కిశోర్‌తో మాట్లాడలేదు తను.

రాత్రి కృష్ణను జోకొడుతూ చాపమీద పడుకున్న తన పక్కన వచ్చి కూచున్నాడు కిశోర్. తిరిగి చూడాలని కూడా అనుకోలేదు తను. కాని, చేతులమీద వెచ్చగా టపటప నీటి బిందువులు పడుతూంటే ఉలికిపడి వెనుతిరగక తప్పలేదు.

కిశోర్ ఏడుస్తున్నాడు!

నుదుటను తగిలిన గాయంతో అపరాధిలా తన ముందు తల వంచుకుని మూగగా కన్నీళ్ళు కారుస్తున్నాడు... తనకి దుఃఖం కట్టలు తెంచుకుంది. ఒక్క ఉదుటున లేచి కిశోర్‌ని చంటిపిల్లాడిలా కౌగిలించుకుంది ... ఒకరి వెచ్చని కన్నీ రొకరి వెన్నుపై అలా ఎంతసేపు ధారలు కట్టిందో ...

"నేను వట్టి బ్రూట్‌ని ... క్షమించు, సుమతి... నువ్వెంతో ముచ్చటగా కొనిపెట్టిన బట్టల్ని రక్తంలో తడుపుకొచ్చి ... నిన్ను ... చాలా హింసించాను కదూ?" కిశోర్ ఇలా అంటూంటే ఏదో బరువు దిగిపోయినట్టయింది తనకి.

"కిశోర్, ఇంకెప్పుడూ ఇలా ఆవేశంగా ప్రవర్తించనని మాట ఇయ్యి ముందు నాకు" అని తను చాచిన చేతిలో బలంగా పడిన కిశోర్ చేయి కొండంత బలాన్ని ఇచ్చింది... అప్పుడు తీసుకెళ్ళి నుదుట తగిలిన గాయానికి కట్టు కట్టింది. తల వంచుకుని ఏమీ ఎరగని అమాయకుడిలా కూచున్న కిశోర్ తను పెట్టిన చీవాట్లన్నీ తిన్నాడు.

ఆ రోజంటే ఇక ఎదురు తిరిగి ఏమీ అనలేదని సంతోషించింది కాని, క్రమేపీ కిశోర్ చాలా మారిపోయాడు. ఉద్యోగానికి అప్లికేషను పెట్టమంటే "అంత ఓపిక లేదు" అని చెప్పే దగ్గరి కొచ్చాడు...

తిండికీ, గుడ్డకీ కటకటలాడవలసి వచ్చింది.

ఉన్నట్టుండి ఓ రోజు మూడు వందల రూపాయలు తెచ్చి తన చేతిలో పోశాడు. కంపించి పోతూ అడిగింది తను ఎక్కడి దింత డబ్బని.

"కొల్లగొట్టుకొచ్చా నన్నట్టు అలా బెదిరిపోతున్నావేం, సుమతీ...ఇది స్వార్జితం. డబ్బు సంపాదించడానికి మార్గా లనేకం. నా స్నేహితుడి ధర్మమా అని ఇదైనా దొరికింది. . . పద, పద...బజారు కెళ్ళి మనకి కావలసిన సరుకులన్నీ తెచ్చుకుందాం..."

"ఇది నువ్వెలా సంపాదించావో చెపితే కాని దీన్ని ముట్టుకుందికి కూడా నాకు భయంవేస్తూంది... ప్లీజ్ ... ప్లెయిన్‌గా చెప్పు..."

"స్లోగన్స్ అందంగా పెయింట్ చేశాను... అలాటి చక్కటి స్లోగన్స్ రాయగలిగితే ఇంకా ఎక్కువ..."

"ఏమిటా స్లోగన్స్? ఇలాంటి ఉద్యోగా లుంటాయని నే నెక్కడా వినలేదు."

"సుమతి!" కఠినంగా వినిపించిం దతని కంఠం.

"దొంగనీ, దోపిడీగాడినీ నిలదీసినట్టు ఏమిటా అడగటం? స్లోగన్స్ ఏమిటో నీకు నేను చెప్పలేను. రెండు రోజుల్లో నీకే తెలుస్తుంది... మరో సంగతి విను ... నీకు వచ్చిన ఉద్యోగాలే అందరూ చెయ్యా లనుకుంటే ఈ దేశంలో సగం మందికి పైగా ఎప్పుడో చచ్చి ఉండేవారని తెలుసుకో!" విసవిసా నడిచి బయటికి వెళ్ళిపోయాడు.

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత-డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మదరాసు.17.

శస్త్రచికిత్స లేకుండా విశ్రాంతి పొందగలరు



బలహీనత మరియు అనేక విధములుగా సాధారణమైన మందులను తీసుకొనుట వలన జబ్బు నయము గాక విసుగు చెందిన యెడల వెంటనే 22 సంవత్సరాల అనుభవంతో ప్రఖ్యాతి గాంచిన

డా. రాయ్
గవర్నమెంటు రిజిష్టర్డు)

సెక్సు స్పెషలిస్టును సంప్రదించి తమ జీవితమును సుఖవంతం చేసుకొనుడు.

నరముల బలహీనత మందువల్లనేకాక విద్యుచ్ఛక్తి యంత్రముల వలనకూడా బాగుచేయబడును. దీనివలన అతి త్వరలో విశ్రాంతి పొందగలరు.
ఆంధ్రప్రదేశ్‌లో 1950 న స్థాపించబడినది)
సంప్రదించు వేళలు:
ఉదయం గం. 8—00 నుండి మ. 1—00
సాయంత్రం గం. 4—00 నుండి రా. 9-30 వరకు.

రాయ్ మెడికల్ హాల్

(బ్రాంచి ఆఫీసు : మొదటి అంతస్తు,
గాంధినగర్, అలంకార్ టాకీస్ ఎదుట),
విజయవాడ-3. ఫోన్ : 74658

హెడ్ ఆఫీసు : మొదటి అంతస్తు,
సెయింట్ మేరీస్ రోడ్, మనోహర్‌టాకీస్ వద్ద,
సికింద్రాబాద్ (ఎ. పి.) ఫోన్ : 72184

No. 2

వెలిగించాడు. జేబులోంచి చేయి బయటికి వస్తున్నప్పుడు ఓ మూరు రూపాయల కాగితం కింద రాలింది. అది అత నేమాత్రమూ గ్రహించనట్లు ఏవేవో మాటలు చెపుతూ లేచిపోయి, వీలయినంత వేగంగా బయటపడాలని ప్రయత్నించాడు.

"కింద పడేసుకున్నావ్—తీసుకో" అంటూ అందించింది తను, అభిమానంతో ఒళ్లు వేడెక్కిపోతూంటే.

"ఆఁ ... ఆరే ... అలాగా ... పడిపోయి ఉంటుంది." తనకేసి అదోలా క్షమించమన్నట్లుగా చూసి తలఆడిస్తూ ఆ నోటు జేబులో కుక్కేసుకున్నాడు.

తప్పుపని చేసినట్టు ముఖం చిన్నబుచ్చుకునే వెళ్లిపోయాడు నాగరాజా.

'ఈ మనిషికి చాలా పెద్దవాడని పేరుంది... అంతకంటే ఎక్కువ తనే ప్రచారం చేసుకుంటాడు... ఏం మనిషి?'

• • •

మాల చావు వార్త మతి పోగొడుతూంటే దీపం పెట్టడం కూడా మరిచిపోయి కూర్చున్న తను, భుజం మీద రెండు చేతులు పడగానే ఉలిక్కిపడింది.

కిశోర్!

ముఖం తిప్పుకుని లేచి వెళ్లి లాంతరు వెలిగించి పెట్టింది.

"ఓ మాట ..." ఏదో చెప్పాలన్నట్టు పిలిచాడు.

తన ఒళ్లు కుతకుతలాడిపోతూంది. పిల్లలిద్దరూ పరుగున వచ్చి 'ఆకలి' అంటూ తనని చుట్టేసుకున్నారు.

"ఇప్పుడా మాటలు వినే తీరిక లేదు." నిర్లక్ష్యంగా అనేసి పిల్లల్ని తీసుకుని లోపలికి వెళ్లిపోయింది.

ఆ రాత్రి ముభావంగా పక్కమీద కూర్చున్న తనను నిర్లిప్తంగా చూస్తూ, "ఎందుకలా ఉన్నావ్?" అన్నాడు పొడిగా.

'రతీ! ఈ దీనుడి మీదా అలక?' అనే వాడు అక్కడి కొచ్చాడు.

అలా అనకపోవడంచేతనే కాబోలు తన మౌనం వేగంగా ముగిసింది.

"ఎలా ఉన్నాను?" విధిలేనట్టుగానే అడిగింది.

"ఉద్యోగం సద్యోగం లేని మొగాణ్ణి చూస్తూంటే అలానే ఉంటుందేమోలే!"

తన ప్రాణానికి ప్రాణం కిశోర్ ఆ మాటఅంటూంటే తన కేడుపు రాదూ మరి!

"ఏం మాటలు నేర్చుకున్నావు కద! సహవాసదోషం ఊరికే పోతుందా? అయినా ఒక్క సంగతి చెప్పు — నా మాట మీద నీకేమైనా గౌరవం ఉందా?"

కిశోర్ మౌనంగా చూస్తున్నాడు తన ముఖంలోకి.

"ఉంటే తక్షణం ..."

"మీ మామయ్య వేయిస్తానన్న ఉద్యోగంలో చేరమంటా వంతేనా? నీవరకూ అప్పుడే ఎలా వచ్చింది సంగతి?" కిశోర్ చూపు మారిపోయింది.

"నాగరా జొచ్చి చెప్పాడులే ఏదో చూచాయగా ... అయినా, మామయ్య మంచి వాడు కాదన్న నెపం పెట్టి ఉద్యోగం మానుకో నక్కరలేదు... రెక్కల కష్టం చేసి డబ్బు సంపాదించడానికి ఒకరి మంచి చెడ్డల గొడవ మన కెందుకు? ఈ మూకలతో తిరిగి చెడే కంటే బంగారు రాజులా అయిదు వందల రూపాయల ఉద్యోగం..పిలిచి మరీ ఇస్తా మంటూంటే ..."

"అయిదువందలేం ఖర్మ! ఇప్పుడు వెయ్యి రూపాయల ఉద్యోగమైనా వేయిస్తాడు మీ మామయ్య నాకు... ఎందుకంత అభిమానం పుట్టుకొచ్చిందో? ఇంతకు ముదంల్లా నాకు వచ్చే ఉద్యోగాలు కూడా ఊడగొట్టించి మానం మెలేసిన మీ మామయ్య ఇప్పుడు నన్ను బతిమాలి మరీ ఉద్యోగంలో చేరమంటున్నాడంటే ..."

"అబ్బబ్బ ... నీతో వచ్చిన చిక్కే ఇది ... మనుషు లెప్పుడూ మారకుండా ఒక్కలాగే ఉండిపోతా రనుకుంటావు... నువ్వెలా ఉండేవాడి వెలా తయారయ్యావు! ఆయనమాత్రం మారకూడదా? ఎంత నా మీద కోపం వచ్చినా, చిన్నప్పటి నుంచి పెంచి పెద్దజేసిన చేతులు ...అభిమానం అంత సులువుగా చస్తుందా...?"

తను ఇంకా ఏమేమో అనబోతూంటే విసుగ్గా చూస్తూ—"మాల చచ్చిపోయింది-తెలుసా?" అన్నాడు.

"తెలుసు." ఉదయం నుండి తను పడుతూన్న నరక యాతనంతా అందు గురించే అయినా చాలా నిర్లిప్తంగా అంది ఎందుచేతో!

"కాని, ఆ ఊసులేవో తెచ్చి కాలం గడిపేసి నన్ను మభ్యపెట్టాలనుకోకు ... అసలు విషయం దాట వెయ్యడంకోసం ..." ఏమిటో తనకి కూడా నాటి పోటీ మాట్లాడడం అలవాటయిపోయింది, మనసులో ఇష్టంలేకపోయినా.

"మాల ఎలా చచ్చిపోయిందో, ఎందుకు చచ్చిపోయిందో తెలుసా?"

నాగరాజా అర్థం పర్థం లేకుండా మాల మరణం గురించి చెప్పిన మాటలు జ్ఞాపకం తెచ్చుకుందికి ప్రయత్నిస్తూ, కోపంగా, అడ్డంగా తల ఆడించింది తను.

"చాలా ఏళ్ల తరవాత అత్తవారు దాని అమ్మని చూసి రమ్మని పంపించారు. పట్నం రాగానే నువ్వే గుర్తుకొచ్చావట దానికి... నీకోసం జాజిపూల దండ అల్లి తీసుకుని వెళ్లిందట ... నువ్వింకా మీ మామయ్య దగ్గరే ఉన్నావనుకుని..."

'అయ్యో ... నాకోసమా ... పాపం ... అయితే? !' ఆ మాటలు పెదిమలు దాటి రావటం లేదని తనకు తెలియలేనే లేదు.

"నా నోటితో ఆ పాపిష్ఠి సంఘటన ఎలా చెప్పను, సుమతీ ... ఆ ఇంట్లో దాని నొక విషసర్పం కాటేసింది. అలాంటి మలిన శరీరంతో త నిక బ్రతకలేనంటూ దాని అన్న ఒడిలోనే ప్రాణం వదిలింది... మాల అన్న రాజాయి మంచిగా ఉండే మేకపిల్ల... పగ వస్తే పాముపిల్ల... మీ మామయ్య నెత్తురు దానికి తర్పణ మిస్తానని ప్రమాణం చేశాడు. రాజాయికీ, నాకూ ఉన్న స్నేహం, నా మాటంటే వాడికున్న గురీ మీ మామయ్యకి తెలుసు. అందుకే నా కా ఉద్యోగం ... అందుకే ఈనాటి మేన గోడలు మీద అభిమానం ... రాజాయి కక్కుతూన్న అగ్నిజ్వాలలకు నన్ను అడ్డు వెయ్యాలనుకున్నాడు... ఫూల్..."

'మాలా ... అయ్యో, మాలా ... నాకోసం వెళ్లి నీ బతుకు బలిచేసుకున్నావా ... మాలా!' కుళ్లిపోతూన్న హృదయంలోంచి పొంగిన దుఃఖం వరసరాళ్ని కాల్చేసిందే తప్ప, కన్నీళ్లు బయటికి రాలేదన్న సంగతే తనకి తెలియలేదు.

"ఇప్పుడు చెప్పు, సుమతీ! మీ మామయ్య వేయించిన ఉద్యోగం చెయ్యమని ఎలా చెపుతావో చెప్పు."

బలవంతాన ఎలాగో పెదిమలు విడివడ్డాయి తనకి.

"అయితే రాజాయికి మద్దతు ఇద్దామనే నిశ్చయించు కున్నావా?"

ఎలా అడగాలనుకుని ఎలా అడిగేసిందో కాని, ఫకాలున నవ్వాడు కిశోర్.

"నా మద్దతా?! ఎందుకు? వాడసలే సింహం... భూనభోంతరాళాలు బ్రద్దలయ్యేలా 'పగ తీర్చుకో, అన్నా!' అని వాడి చెల్లెలి ఆత్మ చేస్తూన్న గర్జనలు చాలదా వాడికి మద్దతు...!"

"నీకు పుణ్యముంటుంది ... నేనూ, పిల్లలూ ఇలాగైనా బ్రతికి ఉండాలనుకుంటే వాడిని దగ్గరకు చేరనివ్వకు. ఆ స్నేహం ప్రమాదం..."

"వాడు నాకేం అపకారం చెయ్యలేదు... అన్యాయంగా ఎవ్వరికీ హాని చెయ్యడు... స్నేహం స్నేహమే... మ వ్వన్నది కుదరదు."

"నా పీకలమీది కేదో తెచ్చేలాగే ఉన్నావు నువ్వు."

"నా అంతట నేను వేటిలోనూ దూరబడటం లేదు."

"అవును. నా ఖర్మ ని న్నలా లాగుతోంది."

"ను వ్వింత సంకుచితంగా తయారవుతావని కల్లో కూడా అనుకోలేదు." తనకి పొంగి పొంగి వచ్చేసింది దుఃఖం.

"ఈ కన్నీళ్లు ఆ అభాగ్యురాలు మాలకోసమైతే నే నానందించే వాడిని." పక్కకి తిరిగి పడుకున్నాడు.

మరి ఎవరికోస మనుకున్నాడో!

తెల్లవారింది ఒక రోజు.

రాత్రి కిశోర్ ఎటో వెళ్లిపోయాడు.

దభ్ దభ్ మన్న దెబ్బలకి చెక్కతలుపు అటూ ఇటూ ఊగుతూంటే జాగ్రత్తగా నొక్కిపెట్టి తలుపుతెరిచింది.

ఎదురుగా కాకీ డ్రెస్సులు ... ఎర్ర టోపీలు. గొంతుక పిడారిపోయింది తనకి.

"కిశోర్ ఎక్కడ?" కటువుగా పలికిం దో గంభీర కంఠం.

"తెలియదు." ఎలాగో అనగలిగింది.

"ఇల్లు సోదా చేస్తాం."

తనకి అంత భయంలోనూ చిన్న నవ్వొచ్చింది. 'ఏం మహలని సోదాట!'

అనవాయితీగా సోదా జరిగింది. ఇన్స్పెక్టరుకి శాల్యూట్‌చేసి నిలుచున్నారు పోలీసులు.

"కిశోర్ జాడ చెబితే మంచిది." వ్యంగ్యంగా ఉం దా కంఠం.

"నా కొకటి తెలిస్తేగా ... మీరే చెపితే నేను సంతోషిస్తాను ...!" వెయ్యి భయాల మధ్య కరుడు కట్టుకున్న ధైర్యం తనది.

"చెపుతాం ... చెప్పితీరుతాం ..." పటపటలాడుతూన్న పళ్లు బిగించి ఏదో కొరుకుతూన్నట్టుగా అన్నాడతను.

వాళ్లు వెళ్లిపోయారు.

తనకి కన్నీళ్లు మిగులుతున్నాయి ఎప్పుడూ.

తనను ఓదార్చే వా రెవరూ లేరు... కనీసం తనను పలకరించే వారు కూడా లేరు... త నసలు కళ్లపడితేనే పులినో, సింహాన్నో చూసినట్టుగా భయంగానూ, అసహ్యంగానూ ముఖం తిప్పుకు పోతా రిరుగూ పొరుగూ...

• • •

ఓ రాత్రివేళ మళ్లా వచ్చాడు.

ఈ సారి కిశోర్ ... ఏమీ ఎరగనట్టుగా వచ్చి పడుకున్నాడు ఓ మాటా మంతీ కూడా లేకుండా.



స్థూలరేఖ

చిత్రం—పులిచెర్ల సాంబశివరావు ( గుంటూరు—2)

తన శరీరంలో అణువణువూ మండిపోయింది.

"నీకోసం పోలీసులు గాలిస్తున్నారు..."

"ఏం విశేషమైన కబురని అది? లేకపోతే నే నీవేళ కెందు కింటి కొస్తాను?"

ఎంత నిర్లక్ష్యం!

"ఏం కొంప ముంచావో చెప్పు పోనీ,సంతోషిస్తాను."

కిశోర్ ముందు ఇక ఏడ్చి లాభం లేదని తెలిసిపోయింది తనకి.

"ఎవరి కొంపా మునగలేదు... ముందు జాగ్రత్త కోసం మీ మామయ్య పోలీసు రిపోర్టిచ్చాడు..."

"అంటే ఏం జరిగిందట!"

"నిన్న రాత్రి రాజాయి మీద కూడా హత్యా ప్రయత్నం జరిగింది. జరుగుతుందని నాకు ముందే తెలుసు... వాడిని కాపాడటం స్నేహధర్మం..."

"ధర్మం...ని న్నెంత ఉద్ధరిస్తూందో తెలుస్తూనే ఉందిగా!"

"ఈ ధర్మాధర్మాలూ, న్యాయాన్యాయాల ద్వారా ఉద్ధరింపబడాలనే కోరిక నా కెప్పుడో చచ్చింది కనకనే ఈ తోవ తొక్కగలిగా న్నేను ... మిగిలిన దొక్కటే జ్వాల ... సుమతీ! అది విప్లవ జ్వాల ... అది అలా కాల్చుకుంటూనే వెళుతుంది... అది అంటురోగం... ఆకలిరోగం... ఒకనాటికి నువ్వూ ఆ రోగానికి లోబడక తప్పదు... విప్లవరోగం... విప్లవం ... విప్లవం..."

"విప్లవం ... విప్లవం ... విప్లవం ... ఆ మాటతో నన్ను కాల్చేయద్దని ఎన్నిసార్లు చెప్పాను... నేను చస్తేగాని నువ్వు ఆప వా మాట..." పిచ్చిదానిలా తల మంచం కోటికేసి కొట్టుకుంది తను.

మెల్లగా తల ఎత్తి చూడబోయేసరికి కిశోర్ రక్తగోళాల్లాంటి కనుగుడ్ల మీద గుడ్డి వెలుగులో తళతళలాడుతూ తొణికిసలాడుతూన్నాయి కన్నీళ్లు.

"కిశోర్!" అంటూ బావురుమంది తను.

చాలా రోజుల తరవాత కిశోర్ గుండెల మీద తనకు చోటు లభించింది. తన తలమీద వేడి నీటి బిందువులు టపటప మంటున్నాయి.

ఆ కన్నీళ్ల మధ్య ఒకరి హృదయంలో ఒకరు.

ఒకరి బాహువుల్లో ఒకరు.

అదేదో అనిర్వచనీయమైన ఆనందం.

పిచ్చెక్కించే శాంతి.

తడిసిన ఇద్దరి పెదవుల మీదా ఆఖరి చిరునవ్వులు.

మాలిన్య మెరుగని అద్దం మీద మమతల కాంతి పుంజాలు.

"సతీ! మనం ఏవైనా దూర తీరాలకు పారిపోదాం... ఈ మనుషులు, ఈ సంపర్కాలు, ఈ కుళ్లు, ఈ రోగిష్టి సమాజం కనపడనంత దూరానికి ..." తన చేతిలో చెయ్యి వేసి బలంగా నొక్కుతూ ఆవేశంగా అంటూన్న కిశోర్ గుండెల్లో ఎలాంటి ఆరని మంట చెలరేగుతూందో తనకి తెలుసు.

"అలాగే, కిశోర్, కాని ... ఈ జీవితానికి పడిన జీడి మచ్చ ఇక తుడవబడదేమో? మళ్లా మనం కొత్తగా పుట్టాలి... కొత్తగా బ్రతకాలి... ఈ జన్మని వేగం అంతం చెయ్యమని దేవుణ్ణి వేడుకోవాలి... అది వేగం జరగాలి..."

తన ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తున్నాడు కిశోర్.

తలుపు దబదబ మనిపిస్తున్నా రెవరో.

భయంగా, అనుమానంగా తన చూపులు.

"కొత్తగా బతుకుదా మన్నావుగా ... తలుపు తెరువు, సుమతీ!" చెక్కుచెదరటం లేదు కిశోర్ కంఠం.

బూట్ల టకటకల మధ్య — "మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం" అన్న మాట తన గుండెల్లోంచి బాకులా దూసుకు పోయింది.

"ఎందుకని?" ప్రతిమలా నిలుచుని ప్రశ్నించింది.

"భుజంగరావు మీద జరిగిన హత్యా ప్రయత్నంలో రాజాయికి తోడుగా ఉన్నందుకు..."

"అబద్ధం ... హత్యాప్రయత్నం జరిగింది రాజాయి మీద!" గొంతు చించుకున్నట్టుగా అరిచింది తను.

"అయ్యో, సుమతీ! ఎంత వెర్రిదానివి! వాడెంత? వాడి బతు కేపాటి? వాడి కెందుకు రక్షణ ఉంటుంది?" కిశోర్ జవాబు.

"పోనీ, ఇది అబద్ధమని చెప్పు, కిశోర్... ఈ విషయంలో నీకేమీ ప్రమేయం లేదని చెప్పు... చెప్పు, కిశోర్..."

"క్షమించు, సుమతీ...ను వ్వన్నట్టే జీడిమచ్చ పడిన జీవితమై పోయింది నాది."

"ఏమిటీ! అయితే ... అయితే ఇది నిజమా! !" రెండు చేతులా తల పట్టుకుని పిచ్చిదానిలా జుత్తు పీకేసుకుంటూ ఏడ్చింది తను.

కిశోర్ చేతులకు బేడీలు పడ్డాయి.

వెళ్లిపోతున్న కిశోర్ రెండడుగులు వెనక్కువేసి దగ్గరగా వచ్చి అన్నాడు:

"సుమతీ, ఈ దౌర్భాగ్యుడికి చిల్లిగవ్వ లేకపోయినా, వెలలేని రత్న మాణిక్యాల్లాంటి భార్యా, బిడ్డలూ ఉన్నారు. తిరిగి వచ్చేవరకూ వాళ్లని నీ కప్పగిస్తున్నాను. ఎలా కాపాడుతావో! వాళ్లు లేనినాడు నిజమైన దరిద్రుడ నయిపోతాను నేను..." గిరుక్కున వెను తిరిగి పోయాడు కిశోర్.

ఏమన్నాడూ కిశోర్? !

సుమతి వర్తమానంలోకి పడింది మళ్లా.

# ఉత్తరాలు

(4 వ పేజీ తరువాయి)

... ఇమిడి ఉన్నాయి. పోతే 'ఉదాత్త చరితులు' సీరియల్ చాలా బాగుంది.

—ఎమ్. ఎ. ఖయ్యూం (నల్గొండ)

• • •

9—8—72 వ తేది ప్రభ 'ముఖచిత్రం' ఎంతో ఆకర్షణీయంగా ఉంది!

ప్రతి వారం మా హృదయాలను దోచుకుంటూ, అత్యంత ఆసక్తికరంగా ఉంటూంది 'ఉదాత్తచరితులు' సీరియల్. ఈ వారం ప్రారంభమైన డాక్టర్ కొత్తపాటి గంగాధరరావు 'లంబాడోళ్ల రాందాసు' సీరియల్ మొదట్లోనే నన్ను ఆకర్షించినది.

ముచ్చటైన మూడు కథలు 'ఆకర్షణ' గా చాలా బాగున్నవి.

—వంగల సత్యనారాయణ (పెడన)

• • •

ఈమధ్య మీరు ప్రచురించే నవలలు చిన్నవైనా చాలా చక్కగా ఉంటున్నాయి. రాధారాణిగారి 'అన్వేషి' తరవాత మనస్సును ఆర్ద్రత పరిచిన నవల యలమంచిలి రఘూస్విలక్ష్మిగారి 'గాజుబొమ్మ' మధ్య మధ్య జయదేవుని అష్టపదులతో, భగవద్గీతయందలి శ్లోకాలతో చాలా రమ్యంగా చిత్రించారు రచయిత్రి. స్త్రీ తన జీవితంలో ఒకే పురుషునికి స్థానం ఇస్తుందన్న మాటలకు ఈ నవల తార్కాణం.

'ఉదాత్త చరితులు' సీరియల్ సాఫీగానే సాగుతూంది. రాజీవ్‌పై కక్ష సాధించే ఉద్దేశ్యంతో అతన్ని వివాహ మాడిన వీణ భవిష్యత్తు ఏ రూపంగా మారుతుందో చూడాలి!

—బి. ప్రసాదరాములు (కరీంనగర్)

• • •

కొండలు, పెద్ద పెద్ద కొండలు. . . అంటూ పల్లె వాతావరణాన్ని చాలా చక్కగా వర్ణించారు 'లంబాడోళ్ల రాందాసు'లో గంగాధరరావుగారు. ప్రారంభంలోనే రాందాసు పరిస్థితి చదివేసరికి జాలి కలిగింది. 'సంపాదకీయం'లో నిరక్షరాస్యత గురించి చాలా వాస్తవంగా వర్ణించారు.

—కడియాల కామేశ్వరి (శ్రీకాకుళం)

• • •

ఈ వారం 2—8—72 మా అభిమాన ప్రభ 'ముఖచిత్రం' ఏమీ బాగాలేదు. 'గాజుబొమ్మ' సీరియల్ అప్పుడే అయిపోయినందుకు చాల బాధవేసింది. ముగింపు మాత్రం చాలా సమంజసంగా ఉంది. 'గాజుబొమ్మ' సీరియల్ చిన్నదే అయినా కథావస్తువు చాలా బాగుంది. 'ఉదాత్త చరితులు' కూడా బాగా రసపట్టులో ఉంది.

రాజీవ్ పరిస్థితి చాలా జాలి పుట్టిస్తూంది. కాని, వీణ మూర్ఖపు పట్టు కొంచెం బాగులేదనిపిస్తూంది. సీరియల్ పేరు చూస్తూంటే కామెడీయే అనిపిస్తూంది. కథలలో 'ఎప్పుడు సంపద కలిగిన', 'అభ్యుదయాని కటువైపు'— ఈ రెండూ వాస్తవానికి దగ్గరలో ఉన్నాయి.

తరవాత 'ప్రమదావనం'లో 'ఉద్యోగిని' అన్న వ్యాసం ఆ మధ్య విజయవాడ మహిళా సమాజంలో ఎవరో ప్రసంగించిన తీరులా ఉంది. అంతా అదే మోస్తరుగా ఉంది.

—పి. శ్యామల (హైదరాబాదు—28)

• • •

ఈ వారం (2—8—72) ప్రభలో 'ఈర్ష్య' కథ చదివి ఎంతగానో సంతోషించాము. 'బాలప్రభ'లో 'మామగారి కోరికలు' చాలా బాగున్నవి.

'ఉదాత్త చరితులు', 'గాజుబొమ్మ' సీరియల్స్ చాలా బాగున్నవి.

ఇక పోతే ఫీచర్స్‌లో 'ప్రమదావనం' చాలా బాగున్నది.

ఈ వారం 'వింతలు—విడ్డూరాలు' చాలా బాగున్నవి. శార్వరి గారికి నా అభినందనలు.

—యామిజాల గణపతి (మద్రాసు)

• • •

ఈ వారం (2—8—72) ప్రభ 'శారద' ముఖచిత్రంతో చాలా బాగుంది.

ముఖ్యంగా యలమంచిలి రఘూస్విలక్ష్మిగారి 'గాజుబొమ్మ' సీరియల్ నవల ముగియడం చాలా విచారకరం. ఈ ఆడవారి రచనలన్నీ ఇలాగే ఉంటాయిగాబోలు. కథను మొదటినుండీ ఇంటరెస్టుగా సాగించి చివరికి ఎందుకూ పనికిరాకుండా కేవలం ట్రాజెడీగా ముగిస్తారు. ఏది ఏమైనా ఈ కథలో శ్యామ్‌కు చాలా అన్యాయం జరిగింది. హిమబిందు పాత్రకు న్యాయం చేకూరిం దనాలి.

—ఎ. వరప్రసాద్ (హైదరాబాదు)

• • •

2—8—72 తేది సంచికలో 'నటరత్నాలు' —పంచాంగం రామానుజాచారిగారిని గూర్చి "ఒకనాడు దేదీప్యమానంగా వెలిగిన మహానటులను గురించి ఈ తరంలో తలచేవారే లేరు. చివరికి కళాకారుల బ్రతుకు ఇంతేనేమో!" అన్న వాక్యాలు నిజంగా నా కళ్లలో కన్నీళ్ళు తెప్పించాయి.

—ఆళ్లచెర్వు అన్నపూర్ణ (గుంతకల్లు)

• • •

'గాజుబొమ్మ' ఏమంత బాగా లేదు. 'ఉదాత్త చరితులు' అనుకోని మలుపులు తిరుగుతూ మమ్ముల నూరించుచున్నది.

'ఈర్ష్య' కథ బందరు లడ్డు.

'ఎప్పుడు సంపద కలిగిన' కలకత్తా రసగుల్లా.

'బెటర్ హాఫ్' చక్కరకేళీ అరటి పండు.

'అభ్యుదయాని కటువైపు' బంగినపల్లి మామిడి పండు. ఇన్ని రుచులతో మమ్ముల నలరించుచున్న ప్రభకు ధన్యవాదములు.

—సర్వేపల్లి యర్రంరెడ్డి (రేబాల)

• • •

మీరు ప్రచురించిన 'శ్రీకృష్ణ భక్తితత్త్వం' చాలా బాగున్నది.

'గాజుబొమ్మ' సీరియల్ ముగింపు చాలా బాగున్నది. నేను అనుకున్నట్లే ముగింపు జరిగినది. "బిందూ! గాజు బొమ్మని పగులగొట్టాను. పగిలిపోలేదు" అన్న శ్యామ్ మాటలు నా హృదయాన్ని కదిలించివేశాయి. మొత్తానికి ఈ సీరియల్ నా హృదయంలో ఒక స్థానం సంపాదించుకొన్నది.

—లక్ష్మాజీరావు మహీపతి (హైదరాబాదు—20)

• • •

ఈ వారం ప్రభలో 'ఆకర్షణ' చదివి ఉత్తరం వ్రాయకుండా ఉండలేకపోయాను. ఈ మధ్య ప్రేమ, పెళ్లి, వరకట్నాలు ఈ సమస్యలపై కథలని చదివి విసిగిపోయిన మమ్మల్ని స్నేహమును ఇతివృత్తంగా తీసుకుని వాస్తవానికి అతి సన్నిహితంగా ఉండేలా వ్రాశారు. నరసింహం పాత్రద్వారా స్నేహానికీ, హోదాకీ చక్కగా సమన్వయపరుస్తూ చెప్పించిన వాక్యాలు బావున్నాయి.

'ఉదాత్తచరితులు' మమ్మల్ని సస్పెన్స్‌తో చంపేస్తూంది. రాజీవ్‌పై వీణ అభిప్రాయం ఈ వారంలోనైనా మారుతూన్నందుకు సంతోషంగా ఉంది. కానీ ఇప్పుడు రాజీవ్ వీణని లెక్కచెయ్యకపోతే? ఎలాగయినా చివరికేమవుతుందో మేము నిర్ణయించుకోలేని నవల ఇది మాత్రమేనేమో? ఎప్పుడెప్పుడు పూర్తిగా చదువుతామా అనిపిస్తూంది!

—ఎస్. విజయలక్ష్మిరెడ్డి (మహబూబ్‌నగర్)

• • •

మీరు ప్రతివారం ప్రచురిస్తున్న శ్రీ శిల్పిగారి 'చిత్రాలలో లేపాక్షి' అద్భుతం. కెమెరాతో తీయబడిన ఫోటోలంటే నమ్మగలం. ఆయన ప్రతిభకు మా జోహార్లు.

—వత్రి రాజాచంద్రం (మద్రాసు) ★

---

'ఈ దరిద్రదేవత విలయ తాండవానికి సమాప్తి ఎప్పుడు? కిశోర్ వచ్చే దెప్పటికి? అన లీ తుఫాను గండం దాటి బయట పడేది ఎలా?'

కొడిగట్టి అంతసేపూ ఎలాగో వెలుగుతూన్న దీపం తుమురు పట్టు లేక ఆరిపోయింది.

(సశేషం)




# గతిహన

(క్రిందటి సంచిక తరువాయి)

## 5

చూరులోంచి సన్న సన్నగా వెలుగు గోచరమవుతూంది. తెల్లవారిందన్న మాట . . . అమ్మయ్య, రాత్రి . . . కాళరాత్రి గడిచింది... ఇదేమిటి ... కాళ్లలో పిల్ల కదలదేం?' భయంగా గుండెల మీద చేయి వేసింది. ఉండి ఉండి ఎగ ఊపిరి తీసుకుంటూంది దా అల్ప ప్రాణి.

'ఏమవుతుందో ...?'

రాము లేచాడు. తమ్ముణ్ణి లేపుతున్నాడు.

"భలే ... భలే ... తమ్ముడూ! చూడరా—మన ఇల్లు ఎంత కిందకొచ్చేసిందో ... పెరుగు గిన్నె పెట్టే ఉట్టి నువ్వూ, నేనూ కూడా అందుకోవచ్చు నిప్పుడు" అంటూ హడావిడిగా వెళ్లి చూడబోతూంటే, "ఆగు! చావగలవు, దగ్గరి కెళితే!' అని గర్జించింది సుమతి.

ఇంటినిండా చెత్తాచెదారం. వాన ఉద్ధృతం తగ్గి గాలిమాత్రం జోరుగా వీస్తూంది... ఉండీ ఉడిగీ సన్నని జల్లు పడుతూంది.

రోజూ ఉయ్యాల్లో చెల్లి ఆవేళకి కంకటిల్లిపోయేలా ఏడుస్తూండేది. 'చెల్లి చాలా బుద్ధిమంతురాలైంది!' అనుకుంటున్నాడు అన్నగారు.

చటుక్కున రాత్రి కూలిన వేపచెట్టు, కాకిపిల్లలు గుర్తు కొచ్చాయి. ఒక్క ఉదుటున చెక్క తలుపు తెరుచుకుని గుమ్మంలో అడుగు పెట్టాడు. కృష్ణ బాగా పొట్టి. వీధిలో నీళ్లు, బురద మోకాళ్లలోతు నున్నాయి. అందుకే అన్న వెనక వెళ్లటానికి సాహసించలేదు.

రాము ఊక పొడుగు కాళ్లతో అంతంత కోక అంగలేస్తూ ఎక్కింటి సీతమ్మ ఇంట్లోంచి తిరిగి వచ్చి, కూలిపోయిన వేప చెట్టు కొమ్మలు పట్టుకుని ఎగబ్రాకుతూ కొగ వెతుకుతున్నాడు.

"ఊ ... అనుకున్నంతా అయింది ... గూడు రెండు మూడు కొమ్మల మధ్య పడి చప్పగా అణిగి పోయింది."

తల్లి కాకి కావుకావుమంటూ గోల పెడుతూంది.

'పాపం! ఏడుస్తూంది!' గుడ్లంట నీళ్లు తిరుగుతున్నాయి రాముకి.

ఫెడీమని తలమీద తన్నేసి వెళ్లిపోయింది కాకి.

తడిసిపోయిన బుర్ర తడుపుకుంటూ ఏడుపు ముఖంతో మెల్లగా కొమ్మలంటే మళ్లా ఎగబ్రాకుతూ సీతమ్మ ఇంట్లోంచి తిరిగి వచ్చేశాడు. ఆ సందట్లో ఏదో పేడు గీసుకుని మోకాలు కొద్దిగా తెగి రక్తం కారుతూంది.

రాముని చూస్తూనే 'నా ఖర్మ' అని నెత్తి కొట్టుకుంది సుమతి.

ఇక బాహాటంగా ఏడవచ్చు ననుకున్నాడు రాము.

"నా కాకిపిల్లలు చచ్చిపోయాయో ..." అంటూ రెండు కాళ్లూ బార్లా జాపి చతికిల పడిపోయాడు.

సుమతి అదేమీ పట్టించుకోకుండా మంచం మీద ఉన్న పిల్ల ముక్కు దగ్గర మాటి మాటికీ చెయ్యి పెట్టి చూస్తూంది.

కృష్ణ ఎప్పుడూ లేనంత బుద్ధిగా సుమతి ఎదురుగా ఉన్న చెక్క పెట్టె ఎక్కి కూచున్నాడు.

"అమ్మా! చెల్లి చచ్చిపోతుందా?" అతి సామాన్య విషయంలా అడుగుతున్నాడు. సుమతి ఎర్రగా భయంగా శక్తిలా చూసింది.

"అయితే, నా కాకలేస్తూంది." ఉండనే ఉంది బ్రహ్మాస్త్రం అన్నట్టు వదిలాడు.

"నన్ను తినేయండి ... మీ ఆకలి తీరిపోతుంది... వెధవ సంత..." గట్టిగా అరిచింది.

రాము ఇంకా రాగం తీస్తూనే ఉన్నాడు.

"నోరు మూస్తావా ..." అంటూ కాళికలా లేచింది. 'రాము ఆడపిల్లయి పోయాడూ!' అనడం లేదు.

రాము మధ్యలో బెక్కేసి ఊపిరి సలపనట్టుగా ఊరుకున్నాడు.

"ఎందు కా దిక్కుమాలిన ఏడుపు?"

తమ్ముడెలాగా అందించాడు ముందుగానే — "ఆకలేస్తూంది" బొంగ్రుడుమన్నాడు.

సుమతి పిచ్చిదానిలా పిల్ల లిద్దరినీ దగ్గరగా తీసి గుండెలకు కుత్తుకుంది. 'ఏం పెట్టడం...ఎటుచూసినా నీరు ... బురద ... ఆకులు, కుళ్లు చెత్త—చెదారం... అంతా బీభత్సం ... కడుపులో తెరిపిలేని అగ్ని వర్షం...'

"చెల్లిని చూస్తూండండి — ఇప్పుడే వస్తా" నంటూ పైట చెంగు బలంగా నడుమున దోపుకుని, కుచ్చెళ్లు మీద కెగగట్టి వీధిలోకి దారి తీసింది.

ఒక్కొక్క ఇంట్లోకి వెళ్లి వెతుక్కుంటూంది, తినే వస్తు వేదైనా దొరుకుతుందేమోనని. తనకంటే ముందు ఓ కుక్క కూడా ఇంచు మించు ఆ పనే చేస్తూన్నట్టుంది. కుక్కకంటే ముందుగా జొరపడి తనే వెతికి తెచ్చేసుకోవాలని సుమతి తాపత్రయం.

కుక్క 'భౌ' మని అరిచింది. భయంగా వెనక్కి తగ్గింది సుమతి.

'ఊరు గొడ్డుపోయినట్టుంది ... ప్రపంచమే గొడ్డు పోయినట్టుంది... ఇప్పుడు దేవుడేం చేస్తున్నాడో... అతని పునః సృష్టి ఎలా చెయ్యాలనుకుంటున్నాడో ...! ఇది వేదాంతుల దేశం ... యోగిపుంగవుల దేశం... తనలాంటి ఆకలిగొట్టు వాళ్లు ఇక్కడెలా పుడతారో కాని, అతి సులువుగా పుట్టేస్తూనే ఉన్నారు. ఎటొచ్చీ చావే అంత సులువుగా రాకుండా ఉంది... చావు ... అమ్మో, పాప!' సుమతి కళ్లలోని నిర్మల జలధారలు క్రింద నున్న బురద నీటితో కలిసిపోతున్నాయి.

'దూరంగా ఏమిటవి ... ఏవో తేలి వస్తున్నాయి. వచ్చేశాయి దగ్గరగా—బాదం పళ్లు... అయ్యో, ఈ తొక్క తినడాని కయినా పనికిరాదు.' వాటినే చేతిలోకి తీసుకుంది.

చీరంతా బురద... బాదం పళ్లు పైట చెంగున బిగించి మళ్లా ఈదుతున్నట్లుగా ప్రారంభించింది నడక.

"అదుగో ... అమ్మ." వీథి గుమ్మం మీద కప్పల్లా గొంతు కూచున్న పిల్ల లిద్దరూ పెన్నిధి లభిస్తూన్నట్టు ఆనందంగా కేకలేస్తున్నారు.

బాదం పళ్లు రాయి మీద పోసింది సుమతి. రాము గుండు రాయి వెతికి తెచ్చా డింట్లోంచి. కృష్ణ వాటి వేపు చురచుర చూస్తున్నాడు.

సుమతి ఒక్క అంగలో లోపలికి పరుగెత్తి పాపకేసి చూసింది.

'ఈ జీవి కేడవడానికి శక్తి లేదేమో!' అనుకుంటూ చెయ్యి వేసింది. చల్లగా నీళ్లలో దేవినట్టుం దా పిల్ల శరీరం. తన అనుమానాన్ని దృఢ పరుచుకుందుకు ఇష్టం లేక ఆశగా పదే పది సార్లు ముక్కు దగ్గర చెయ్యిపెట్టి చూసింది. అటూ ఇటూ కదిపింది. ఆ పిల్ల కర్ర బొమ్మలా ఎటు తిప్పితే అటు తిరిగింది. మంచంపట్టె కేసి తల గట్టిగా బాదుకుంటూంది సుమతి.

రాము, కృష్ణ బాదం పళ్లు కొట్టుకునే సందట్లో ఉన్నారు. "అయ్యో, ఇందులో రెండు కుళ్లిపోయాయి కూడా!" రాము మళ్లా చాలా పెద్దవాడయి పోయాడు. బాగున్నవి తీసి తమ్ముడి కెక్కు విచ్చాడు. అయినా, కృష్ణ ఇంకా ఎందుకో తగువులాడుతూనే ఉన్నాడు.

చిన్న కీచులాట.

ఏదో చెక్క బల్ల ప్రవాహంలో కొట్టుకొస్తూంది.

"రారా, తమ్ముడూ!" రాము ఉత్సాహంగా లేచి వెళ్లి తమ్ముడి ఉడతా భక్తితో ఆ బల్లని ఆపాడు.

సుమతి ఏమంటుందోనని లోని కొకసారి తొంగి చూసి, ఎక్కడా చడి లేకపోవడంతో ఎలాగో ప్రయాసపడి దారి కడ్డుగా విరిగి పడిఉన్న చెట్టు కొమ్మకి, అరుగుకి మధ్యగా ఆ బల్లని వేసి, దానిమీ దెక్కి సంతోషంగా ఆట ప్రారంభించాడు.

ముందు ఆ బల్ల ఎక్కడానికి భయపడిన కృష్ణ కూడా చివరికి సాహసించి అన్నలాగే నిర్భయంగా బల్ల మీద ఫీట్స్ చేశాడు.

సుమతి వచ్చి దెబ్బలాడే లోపున వీలయినంతగా ఆడేసుకోవాలన్న ఉబలాటంలో ఎన్ని గంటలసే పలా ఆడుకున్నారో వాళ్లకే తెలియలేదు. ఆ సంరంభంలో ఆకలీ తెలియలేదు.

ఎంతసేపు అలా ఆడుకున్నా సుమతి మాత్రం వచ్చి కేకలెయ్యలేదు. అదో పెద్ద వింత వాళ్లకి. మళ్లా గాజు కమ్మేసి విపరీతమైన వర్షం ప్రారంభమయింది.

"ఇక తర్వాత ఆడదాం" అని తమ్ముడిని తీసుకుని లోపలి కొచ్చాడు రాము.

సుమతి ఉదయాన్నే ఎలా కూచుందో ఇప్పటికీ అలానే కూచుని ఉంది. చిరపిరిగా పిరబోసిన జుత్తు... గడు మాసిన బురద కౌగిలించుకున్న చీర ... ఒంటినిండా అక్కడక్కడ ఎండు ఎండుతూన్న మట్టి చారికలు. నుదుటి మీద తోక చుక్కలా పాకి లీలగా కనిపిస్తూన్న



—ఎ. శ్యామలారాణి











కుంకంబొట్టు... దాని కింద ఉబ్బి, భారంగా జ్యోతుల్లా వెలుగుతూన్న రెండు కళ్లు ... ఆ కళ్ల లోంచి తెంపులేని ధారలు ... తన కొయ్యబిడ్డ మీద అలవాటు ప్రకారం నిద్రపుచ్చుడానికి పడే చేతులు... అలాగే తల్లి ఎదురుగా నిలుచుని కొయ్యబొమ్మల్లా చూస్తున్నారు పిల్లలిద్దరూ.

"చెల్లి చచ్చిపోయింది, నాయనా..." ఎన్నాళ్లయ్యో తుప్పుపట్టిన ఇనప తలుపు తెరుచుకున్నట్లుగా ఉం దా కంఠం.

"ఊహూ." 'సరే అయితే' అన్నట్లుంది పొద్దున్నంతా కాళ్లు బారజాచుకుని కాకి పిల్లలకోసం ఏడిచిన రామూ కంఠం.

అయినా, ఆ చెల్లి వాళ్లతో ఎప్పుడూ ఆడుకోలేదు. ... నవ్వినా వెక్కిరించిన ట్లుండేది. మీదుమిక్కిలి సుమతి పనీ పాటూ చేసుకుంటూంటే తప్పనిసరిగా ఆడించా లన్నదో పెద్ద గొడవ. ఇష్టం వచ్చినప్పుడు తీసి ఆడుకొనే బొమ్మయినా కాదు కనీసం. చెల్లికోసం, అమ్మ సంతృప్తికోసం ఏడ్చి తీరాలనే వయసయినా కాదు.

"చెల్లి ఇక లేదమ్మా ... చచ్చిపోయింది. వెళ్లిపోయింది, మనకి దూరంగా వెళ్లిపోయింది." ఏడుస్తూ పిల్లలిద్దరి తలలూ దగ్గరగా చేర్చుకుని ఆవిసిపోతూంది సుమతి.

"అరే, దగ్గరగానే ఉందే!" చెల్లి శరీరాన్ని ముని వేళ్లతో తాకి చూస్తున్నాడు రాము. మార్పేమిటో తెలియక విస్తుబ్ధతగా చూస్తున్నాడు.

కృష్ణమూర్తి సుమతి చెవి దగ్గరగా ఉంది.

"అమ్మా! ఆకలి...ఆకలి ... ఆకలి..."

'నన్ను తినేస్తే నీ ఆకలి తీరిపోతుంది' అని ధ్రువ లేవలేదు సుమతి. వాళ్ల ఆకలి తీర్చలేని దిక్కుమాలిన శరీరంకేసి అసహ్యంగా, క్రోధంగా చూసుకుంటూంది కన్నీటి అలల మధ్య.

'ఇప్పుడేం చెయ్యాలి? దుఃఖం, ఆకలి, నిస్సత్తువ, భయం అన్నిటినీ ముందువతలకు నెట్టి, పాపని పాతి పెట్టాలి.

'అయ్యో, దేవుడా! ఏ ఆడదానికి ఇటువంటి శిక్ష వెయ్యకు ... నీకు పాపం వస్తుంది... తన తనువులో తనువు, ప్రాణంలో ప్రాణంగా పెంచిన శిశువుని తన చేతులతోనే గొయ్యి తీసి కప్పెట్టే ఘోర శిక్ష ఏ కన్న తల్లికీ వెయ్యకు, భగవాన్ ... నీ దైవత్వాని కది కళంకం ... ఈ ఉసురు ఎవర్ని కట్టి కుదుపుతుందో ... శ్మశానం కనీసం ఇక్కడికి రెండు మైళ్ల దూరమైనా ఉంటుంది...'

సుమతి కళ్లు చికిలించి బాధగా, బరువుగా ద్వారం లోంచి బయటికి చూసింది. ఫెళఫెళ ఉరుములు, కుండపోతగా వర్షం. తెల్లవారగానే తెరిపి ఇచ్చినట్టే ఇచ్చి మళ్లా పట్టుకుంది ... హోరుగాలి, సన్నగా జల్లు వచ్చి శరీరాల మీద పడుతూనే ఉంది... మరలా ప్రవాహం ఉద్ధృతమై పోతూంది... రాత్రికంటే వికృతంగా పరిణమిస్తూంది. పెరటి వసారా వేపు జారి పడిన గోడ తన్నుకొచ్చే నీటికి మాత్రం అడ్డుపడింది. కుప్పకూలి ... గాలి బలంగా వీచినప్పుడల్లా గుడిసె అటూ ఇటూ ఊగుతూన్నట్టుంది సుమతి కళ్లకి. భయంగా కళ్లు తెరిచి బయటికి చూస్తే సర్వ ప్రకృతి వశం తప్పి ఊగిపోతూన్నట్టే ఉంది... ఈ చీకట్లో... గిరగిర తిరుగుతూన్నవి కళ్లూ, వస్తువులూ అని తేల్చు కుందుకు ప్రయత్నించి విఫలురాలౌతూంది.

ఉండి ఉడిగీ మూడక్షరాలు మంత్రం అక్షరలక్షలై వినిపిస్తూనే ఉంది, చెవిలో హోరు పెట్టినట్టు. ఆకలి ... ఆకలి ... ఆకలి ...

ఆ మంత్రాని కున్న శక్తి అద్వితీయం. నరాల్లో మిగిలిన శక్తినంతటినీ కూడగట్టుకుని లేచేలా చేసింది సుమతిని.

అప్పుడు ఎన్నిగంట లేసి ఉంటారో తెలియదు కాని, సాయంకాలం అవుతుంది కొద్దిసేపట్లో అనిపించింది. మధ్యాహ్నం నుంచి చెవులు దిబ్బళ్లేసి పోయేలా కురిసిన వాన కొద్దిగా తగ్గుముఖం పడుతూన్నట్టుంది. 'ఇక నైనా బయలుదేరకపోతే లాభంలేదు.'

"రామూ! చెల్లిని దేవుడి కిచ్చి రావాలి... తమ్ముడూ, ... తినడానికేమైనా తెస్తాను..." సుమతి తెగింపుగా కళ్లు తుడిచేసుకుంటూ అంటూన్న మాటల్ని పొంచి నట్టుగా వింటున్నాడు. రాము.

"వద్దొద్దు ... చెల్లి నిచ్చేయద్దు..." ఎప్పట్నుంచో మారాం చేస్తున్న వాడిలా అన్నాడు కృష్ణ.

"పిల్లేదు... ఇచ్చేయాలి ... ఇది ఇక దేవుడి పాప అయిపోయింది." రెండు చేతులా ఎత్తి సుమతి భుజం మీద వేసుకుందుకు ప్రయత్నిస్తూన్న పాప చెయ్యి పట్టి లాగబోయాడు కృష్ణ. పాప లొంగలేదు. కొయ్యముక్కలా అమ్మ భుజమే ఎక్కింది.

వర్షం బాగా తగ్గింది కాని, అప్పుడే చిన్న చీకట్లు ముసురుకుంటున్నాయి.

"రామూ, తలుపేసుకునిలోపల బుద్ధిగాకూచోండి... ఏం భయంలేదు ... " వీర వనితలా ఏమేమో చెపుతూ దండెం మీదున్న చీర మడత పాపమీద నుంచి, తన తల మీద నుంచి కప్పుకుంది. వెనుతిరగబోతూ గుడిసెచే పోమూరు కిందినుంచి మీదివరకూ ఆదే పనిగా చూసింది సుమతి.

'ఫరవాలేదు... అంతలోనే...అబ్బే ... ఇది చాలా దిట్టమైన గుడిసె కనకే వెనక పంచ జారినా నిబ్బరంగా నిలుచుంది... ఏం ఫరవాలేదు... అబ్బే ...'

"అమ్మా, నాకు భయం ... నేనూ వస్తా." కొంగు పట్టుకున్నాడు కృష్ణ.

"ఒరేయ్ ... నువ్వెలా వెళతావ్, పొట్టి బుడం కాయం తున్నావ్ ... బుడుంగువ మునిగిపోతావ్... గుమ్మం దిగగానే." రాము పొడుగ్గా నిలబడి భూమికి జానెడెత్తు ఉన్నట్లుగా చూస్తున్నాడు తమ్ముడిని.

"తినడానికి తెస్తాగా — మంచివాడివి కదూ!" విదిల్చేసుకుని గుమ్మం దిగిపోయింది సుమతి. "అమ్మా, తొందరగా వచ్చేయాలి సుమా!" ఆమడ దూరానికి వినపడేలా కేక పెడుతూ, ఏడవబోతూన్న తమ్ముణ్ణి లోపలికి లాగి తలుపు మూసేశాడు రాము.

* * *

సుమతికి ఆ ప్రవాహంలో అడుగు పడటమే కష్టంగా ఉంది. అటుపైని చిన్న తుంపర... చలి. ఉండి ఉండి కాలికి బలంగా ఏవో తగులుకుంటున్నాయి. అసలే బురద గుంటలు— ఎక్కడపడితే అక్కడ— దేట్లో కాలు కూరుకుపోతుందో. రాత్రి గాలికి కూలి పోయిన ఎన్నో పూరిళ్లు కుప్పల్లా కనిపిస్తున్నాయి. చెట్ల కొమ్మలు విరిగిపోయి బావిలిల్లా వేలాడుతున్నాయి.

వీధి చివర లాంతరు స్తంభం పడిపోయిన ఓ పాక మీద వెళ్లి పడుకుంది. ఎక్కడినుంచో కప్పను పట్టి తెచ్చి దాని మీద కూచుని రెక్క అల్లార్చుకుంటూ, ముక్కుతో పొడుచుకు తింటూందో కాకి... భరించ లేని కుళ్లు వాసన... నీచుకంపు... భుజం మీద కొయ్య పాప ఎప్పుడూ లేనంత బరువు ... సుమతి నడక ఆగిపోలేదు.

'నయమే ఈమాత్రం తెరిపి ఇచ్చింది ... అయినా ఈ వర్షం ఎలా తగ్గుతుంది?'

సుమతికి తన చిన్నతనం జ్ఞాపకం వస్తూంది ...

'మామయ్యగా రింటికి నాలుగి ళ్లవతల ఓ చిన్న కూలిపోతూన్న కొంపలో ఉండే మూడు కాళ్ల ముస లమ్మ ఓసా రిలాగే ముసురు పడితే మండుతూన్న కొరకంచు తీసుకెళ్లి ఆకాశానికి చూపించిందట... అంతే. దెబ్బతో హడలిపోయినట్టుగా మేఘా లెక్కడి కక్కడ విడిపోయి టక్కున చినుకు రాలలేదట... పిల్ల లంతా ఆశ్చర్యంగా చెప్పుకుని ఆ ముసలిదాన్ని చూడ్డా నికి వెళ్లా రప్పుడు ... తామందరినీ చూసి ఎలా నవ్విందనీ అది! అబ్బ ... దయ్యాలు ఇలాగే నవ్వుతాయి కాబోలు అనిపించి ఎంత భయం వేసింది తనకి!


'అప్పుడు అత్త ఉండేది ... అత్త...

'ఓసా రెప్పుడో తనకి జ్వరం వస్తే భోజనం మానేసి ఉపవాసాలతో రెండు రోజులు తదేకంగా దేవుణ్ణి ధ్యానిస్తూ కూచుందట ... తనకి తెలివివచ్చి చూసిన నాడు నిజంగానే అత్త చాలా వాడిపోయి ఉంది ... మామయ్య ఎంతెంత లేసి కేకలేశాడో అత్తని! తన కోసం ఏమైనా భరించేది అత్త, పాపం ... అత్తకు పిల్లల్లేరు.

'మామయ్య కేకలను అత్త బొత్తిగా లక్ష్య పెట్టేది కాదు కాని, అప్పుడప్పు డెందుకో విపరీతంగా ఏడుస్తూ "దేవుడనేవా డున్నాడులెండి. కళ్లు మూసుకు పోయి మీరు చేసే పనులన్నీ ఆయన కళ్లు తెరుచుకుని బాగా చూస్తూనే ఉన్నాడు..." అంటూ ఇంకా ఏమేమో అనేది. మామయ్య అత్తనేం చేస్తాడో నని తను భయ పడేది ... కాని ... అతను వెటకారంగా నవ్వుకుంటూ వెళ్లిపోయే వాడు... తన మనసెంతో తేలికపడే దప్పుడు. కాని, అత్త ఆ నవ్వుకే ఎక్కువ బాధపడినట్టు కనిపిం చేది, కొరడా దెబ్బలు తిన్న కంటే ఎక్కువగా...

తనకి పన్నెండే ళ్లప్పుడు కాబోలు — అత్త కాలి పోయి చచ్చిపోయింది — ఎందు క్కాలిపోయిందో, పాపం. అందరూ పరామర్శించడానికి వస్తే మామయ్య వెక్కి వెక్కి ఆడదానిలా ఏడ్చేవాడు. తన కెందుకో ఆ ఏడుపు చూస్తే పరమ అసహ్యం వేసేది... అతనే అత్తని కాల్చి చంపేశాడేమోనని లోపల్లోపల అనుమానంగా ఉండేది. ఎవరితోనూ అనలేక లోలోనే సతమతమయ్యేది... రాత్రిళ్లు నిద్రపోకుండా అలానే కూచుని ఏడ్చేది... చివరిసారి అత్తని చూడనివ్వనేలేదు... భయపడతా వంటూ బలవంతంగా గదిలో పెట్టేసి బయటికి రానివ్వనే లేదు.

"అప్పుడు నేనే అత్త శవాన్ని చూసి ఉంటే — అంతక్రితం రాత్రి వాళ్లిద్దరి మధ్య జరిగిన గొడవ గురించి పిచ్చిగా చెప్పేసేదేమో తను అందరి ముందూ. "మీరు మనిషా ... రాక్షసులు ... మీకు ... అసలు హృదయం అంటూ ఉందా? అదొక బండరాయి... కూలివాళ్ల కూడు కొట్టి పొట్ట పెంచుకుని, అమాయ కుల మానా న్నపహరించి ... మీసం మెలేసుకు తిరిగే



అహమ్మదాబాద్ మసీదు ఫోటో — ఎస్. బలరామ్ (అహమ్మదాబాద్)

మిమ్మల్ని ... మిమ్మల్ని ..." అంటూన్న అత్త నోరు ఒక్కసారిగా మూసుకుపోయింది.

"ఇడియట్ ... పిస్టల్ తీస్తావా ... నన్ను చంపేద్దా మనే ... అయితే నీ కిక భూమ్మీద నూకలు చెల్లా యనుకో ... రాస్కెల్..." మామయ్య గొంతు నిజంగా పిశాచాల గొంతులాగే ఉంది. అత్త చెప్పిన ఆంజనేయ దండకం పఠించుకుంటూ పడుకుంది తను.

'తను అత్తకోసం ఏడ్చినప్పుడల్లా తనకి జబ్బు చేసినప్పుడు ఉపవాసాలతో శుష్కించిపోయిన ఆ నాటి అత్త ముఖమే కళ్ల ఎదుట మెదిలేది ... పాపం! అత్త...'

• • •

'అరె! చాలాదూరం వచ్చేశానే ... ఎలా నడవగలనా అనుకున్నాను ... అమ్మో! ఎంత చీకటో ... పిల్ల లెలా ఉన్నారో ... ఫరవాలేదు ... రాము! వెర్రివెధ వింకా ఆరేళ్ల వాడే కాని, ఎంత ధైర్యం! వా డెందుకో చాలా గొప్పవాడవుతా డనిపిస్తుంది తనకి.

'కృష్ణ! పట్టి అల్లరిబోతు ... చిన్నవాడు కదూ మరి! పెద్దవాళ్లయితే వాళ్లిలాంటి ఉద్యోగాలు చేస్తారో!

'రాము తన కళ్ల ముందు హోదాగా ఏవరో ఆర్మీ ఆఫీసరులా కనిపిస్తాడు. కృష్ణ ... కోర్టులో జడ్జీ ముందర ఏదో అతి చాకచక్యంగా మాట్లాడుతూ కోర్టంతా మురిసిపోతూంటే, ఆ నల్లకోటులో దర్జాగా దూరంగా కూచున్న తనకేసి చూస్తున్న ట్టుంటుంది.

'ఒకరు దేశ రక్షణ కోసం — ఒకరు న్యాయరక్షణ కోసం ... కిశోర్ వెనకెప్పుడో తాము పడిన బాధలన్నీ మరిచిపోయి, అదోలా చూస్తాడు తనకేసి చిలిపిగా. తను కళ్లతోనే కసురుతుం దప్పుడు...'

సుమతి పాతిక ముప్పై సంవత్సరాల ముందుకి పోయి చాలా ఆనందంగా ఉంది.

ఎక్కడో ఖణఖణలాడుతూ దూరంగా పిడుగు పడింది. ఒక్కసారి తెప్పరిల్లి ఈ లోకంలో కొచ్చింది మళ్లీ. త్రుటి కాలంలో మనసు మహారణ్యమైపోయింది.

## 6

అది కొద్దిగా మెరక ప్రదేశం. అట్టే నీరు నిలిచి లేదు. అక్కడికి శ్మశానం ఎంత దూరమో ఏమిటో ఇంకా?

కొద్దిపాటి దూరంలో ఉన్న శివాలయంలోంచి మిణుకు మిణుకు మంటూంది అఖండ దీపం.

జుత్తు విరబోసుకుని చేతులు చాపిన రాక్షసిలా భయంకరంగా కనిపిస్తూన్న వటవృక్షం క్రింద ఒద్దికగా ముడుచుకు కూచున్న గువ్వ పిట్టలా ఉంది శివాలయం.

చిన్న కాంతిరేఖ కళ్లపడగానే ఏదో ఆశ మొలకె త్తింది సుమతికి. వీలయినంత వేగంగా నడుచుకుంటూ ఆలయం దగ్గరికి చేరుకుంది.

లోనుంచి సన్నగా, మధురంగా పూజారి నీలకంఠ శాస్త్రి కంఠం వినిపిస్తూంది.

"జన్మజ దుఃఖ వినాశక లింగం, తత్ప్రణమామి సదాశివ లింగం..."

ఆ రాగమాధురి కామె శరీరంలోని అణువణువూ నీరై పోతున్నట్లనిపించింది. మూగగా కన్నీళ్లు కారుస్తూ నూనె దీపం వెలుతుర్లో సన్నగా నిగనిగలాడుతూ, నిరాడంబరంగా నిశ్చల సమాధిలో కూచున్నట్లు ఆ శివలింగాన్ని తదేకంగా చూస్తూ అలా మెట్ల చివరనే నిలబడింది సుమతి.

శాస్త్రి కంఠం ఆకస్మాత్తుగా ఆగిపోయింది.

గర్భగుడిలో లింగానికి కొద్దిగా పక్కగా కూచున్న అతను ఏదో అలికిడయినట్లయితే వెనుతిరిగాడు. లీలగా కనుపించింది సుమతి ఆకారం. చేతిలో పుస్తకం దర్భాసనం మీద పడేసి పక్కనే ఉన్న అగ్గిపెట్టె చేత నందుకుని, తువ్వాలు భుజం మీద వేసుకుని బయటి కొచ్చాడు.

సుమతి భయంగా పాప కనపడకుండా కప్పింది బట్ట.

"ఎవరూ? అన్నపూర్ణా? కాదు... కాదు..." చురుక్కున అగ్గిపుల్ల వెలిగింది.

తీక్షణంగా చూశాడు శాస్త్రి.

సుమతి కళ్ళు తుడిచేసుకుని అప్పుడే తల ఎత్తింది.

"సుమతీ! నువ్వటమ్మా? అయ్యయ్యో ... ఇంత వర్షంలో...చలిలో...ఈ కటిక చీకట్లో... ఏమి టిలా... మీ వాడలో అందరూ వెళిపోయా రనుకున్నాం... మువ్వెళ్లలే దేమిటమ్మా?"

ఆశ్చర్యం మీద ఆశ్చర్యం, ప్రశ్న మీద ప్రశ్న శాస్త్రి ముక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఆప్యాయత నిండిన ఆ కంఠం వినగానే 'నన్నెవరూ తీసుకెళ్లారు కాదు, బాబాయ్!' అని చిన్న పిల్లలా గట్టిగా ఏడవా లనిపించింది సుమతికి. అంతలోనే తను ఇల్లాలినని, ముగ్గురు బిడ్డల తల్లినని జ్ఞాపకం వచ్చినట్టుంది.

"లేదు... వెళ్లలేదు, బాబాయ్!... అయినా ఈ చిన్న పిల్లల్ని తీసుకుని వెళ్లడం అంత సులువా? రెండు రోజుల కదే సర్దుకుంటుందని..." దిగమింగుకుంటూ ఎలాగో అంది.

"అవున్లే, పాపం! చాలా అవస్థ ... ఒంటరి దాన వాయె... కిశోర్ అయినా లేడు... ప్చ్... ఏమిటో భగవంతుడి లీలలు... మీదకు రా, అమ్మా, తడిసిపోతున్నావ్ ... లాంతరు వెలిగిస్తానుండు" అంటూ నీలకంఠశాస్త్రి మళ్లీ గర్భగుడిలోకి నడిచాడు.

శాస్త్రి తరుచుగా వాళ్ల మామయ్య ఇంటికి వస్తూండేవాడు. తను ఎవరూ చెప్పకుండానే 'బాబాయ్' అని పిలవటం నేర్చుకుంది. వచ్చినప్పుడల్లా ప్రసాద మంటూ ఓ కొబ్బరిముక్కో, పండో కాయో తెచ్చి తప్పక చేతిలో పెట్టేవాడు. నుదురు నిండిపోయేలా విభూతి పిండికట్లతో అతణ్ణి చూడగానే తన కెప్పుడూ ఏదో పూజ్యభావం కలిగేది... తన తండ్రిని గురించి ఎంతో ఘనంగా చెప్పేవాడు బాబాయ్. తనామాత్రంగా బతికి ఉండటానికి అతనే కారణం అని చెప్పుకుని ఎంత గానో సంతోషిస్తూ ఉండేవాడు. మామయ్య దగ్గ రున్నప్పుడు మాత్రం అతనలా అనడం తను వినలేదు.

దీపం వెలుతుర్లో వర్షపు ధారలు మెరుస్తున్నాయి.

"ఏం పిల్ల వమ్మా ... ఇంత ముసుర్లో చంటిదాన్ని కూడా తీసుకొచ్చావ్. అరె ... అక్కడే నిలుచున్నావేం? మీదకు రా, అమ్మా!" ప్రేమ నిండిన కంఠంతో నీలకంఠ శాస్త్రి పిలుస్తూన్న కొద్దీ సుమతికి దుఃఖం, భయం ఒకదాని వెంట ఒకటి పోటాపోటీలు పడు తున్నాయి.

'భుజంమీదున్నది పాప కాదని ... పాప శవమని... చెపితే ఏం కొంప మునుగుతుందో! మాటమాత్రమైనా చెప్పకుండా ఆలయాన్నీ, తననీ అపవిత్రం చేసేశానని అనుకుంటాడేమో! తెలిస్తే ... ఈ చలిలో, పాపం .. అసలే బక్కచిక్కిన మనిషి. స్నానం చెయ్యలేడు. రాము, కృష్ణ ఆకలితో మాడిపోతున్నారు ... బాబాయ్ చాలా మంచి వాడు ... వాళ్ల ప్రాణాలు నిలబెట్టడాని కిదొక్కటే ఆధారం... ఈ సంగతి చెప్పకపోతేనేం?'

సుమతి సంకోచంగా ఒక్కొక్క అడుగే వేస్తూ మెట్లెక్కి, తడవకుండా ఉన్న చోటు కొచ్చి శాస్త్రికి కాస్త దూరంలో నిలబడింది.

బయట మెరుపులు జాస్తిగా ఉన్నాయి.

శాస్త్రి తనకేసి సూటిగా చూస్తున్నాడు. జీవితపు మూడో ఘట్టంలో ముప్పాతిక భాగం పూర్తిచేసిన ఆ పూజారి కళ్లలో సన్నని నీటి జీర మెదులుతూంది.

'పోల్చేశా డేమిటి చెప్మా!' కొద్దిగా వణికింది సుమతి.

"ఎంత దుర్మార్గుడు భుజంగరావు!" పళ్ళు కొరుకు తున్నట్లుగా అంటున్నాడు. కాస్త స్థిమితపడింది సుమతి.

"ఈవేళ ఇంత నీ దుస్థితికి వాడు కాదూ కారణం?"

నీలకంఠ శాస్త్రి తరుచుగా 'తమరు' అనే మాట్లాడే వాడు భుజంగరావు సమక్షంలో.

"నీ డబ్బులో నీకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదన్న మాట!"

"ఇంకెక్కడి డబ్బు? ఏదో నన్నామాత్రం పెంచి పెద్దచేసి చదువు సంధ్యలు చెప్పించాడుగా ... అయి పోయి ఉంటుంది... నేను కిశోర్‌ని పెళ్లి చేసుకుంటా నని చెప్పిన సందర్భంలో అన్నాడు లెండి — 'మీ బాబు ముల్లెతో ఓ ఇంతదా న్నయానని గర్వపడు తున్నావు నువ్వు. కృతఘ్నులకి అపాత్రదాన మయిందినా' దని. తనే ఇంకా ఏమైనా సహాయం చేశాడేమో...!"

"నాకు తెలుసమ్మా ... నాకు తెలుసు ... నూరు రాబందుల్ని తిన్న గొడ్డు కో పెనుగాలని... రాకపోదులే ఆ రోజు..." శపిస్తున్నట్లుం దతని కంఠం.

"బాబాయ్ ...!" పిలిచి ఏం చెప్పాలో తెలియక గాభరాగా చూసింది సుమతి.

"ఏమమ్మా ... అస లింత రాత్రి వేళ ఎక్కడికని బయలుదేరావ్?"

"ఇ...క్క...డి...కే." కాస్త తడబడినా, అబద్ధం బాగానే చెప్పింది.

"ఏమిటీ ...!" ఆశ్చర్యంగా నోరు తెరుచుకుంది అతనికి.

"బాబాయ్ ... ఏమీ అనుకోకపోతే ... చిన్న ప్రార్థన..."

"అయ్యో, చెప్పు, తల్లీ!"

"పిల్లలిద్దరూ ఆకలితో చుట్టుకు పోతున్నారు... తినడాని కేమయినా ..." అలా అడగవలసి వచ్చినందుకు సిగ్గుతో తల వాల్చేసుకుని కుడి చెయ్యి కొద్దిగా ముందుకి జాచింది సుమతి. ముఖం మీద నుంచి అస్తవ్యస్తంగా వేలాడుతూన్న తలవెంట్రుకలగుండా


ఇప్పుడు మీరు దగ్గు, గొంతుక నొప్పి కలిగించు క్రిములను సమూల నాశనము చేయగలరు



రెండు విధాల పనిచేయు
డెక్వాడిన్
ఉపశమన మిస్తుంది; త్వరగ నివారణ నిస్తుంది



రెండు విధాల పనిచేయు డెక్వాడిన్‌లో మాత్రమే డెక్వలీనియం క్లోరైడ్ ఉన్నది.
1. ఇది క్షణం మీద గొంతుక నొప్పిని ఉపశమింప చేస్తుంది.
2. మీకు దాని వేగ నివారణ కలుగజేస్తుంది.
సదుపాయంగ వది బిళ్ళల స్ట్రిప్ ప్యాక్‌లో దొరుకుతుంది.
దగ్గు, గొంతుక నొప్పినుండి వేగంగ నివారణ పొందుటకు గ్లాక్సోవారి డెక్వాడిన్ ఆంటిసెప్టిక్ లాసెంజెస్, గ్లాక్సో
GLO-969

కారుతూన్న తల మీది నీటి చుక్కలు ఆ చేతిలో పడ్డాయి.

నీలకంఠ శాస్త్రి కడుపులోంచి ఏదో ఆరని మంట చెలరేగింది. అది పుత్రశోకాన్ని మించినట్టుగా ఉంది. గట్టిగా బిగబట్టిన పెదవులు ఎంత దుఃఖాన్నాపుకుంటున్నాయో చెప్పకనే చెబుతున్నట్లున్నాయి.

"ఎంత ఘోరం ... ఎంత ఘోరం..." గద్గదంగా కంఠం వణికిపోతూంటే ముక్కుమీద వేలేసుకున్నాడు.

"వెర్రి తల్లీ ... అలా అడగకమ్మా ... నేను భరించలేను..." గబగబా ఒలికిపోయాయి కనుకొలుకుల్లోని నీళ్ళు.

సుమతికి అన్ని దుఃఖాలూ ఏకమయిపోయాయి. ఏడవడాని కెంతో స్వేచ్ఛ లభించినట్లయింది.

"పిల్లలిద్దర్నీ ఎక్కడుంచావమ్మా?"

"ఇంట్లోనే." చిన్న పిల్లలా బెక్కుతూ చెప్పింది.

"అయ్యయ్యో ... అసలే మట్టితో కట్టిన ఇళ్ళవి. వారం రోజులాయె ఉండీ ఉడిగీ కురుస్తూన్న వానలకు బాగా నానిపోయి కూడా ఉంటాయి. అందులో ఈ గాలివా నొకటి... పిల్లలతో ఆ ఇంట్లో ఉండడానికి నీకు ధైర్య మెలా వచ్చిందమ్మా? !"

సుమతికి ఒక్కసారి చాలా భయంవేసింది.

తను వెళ్ళేలోపలే ఆ గుడిసె కూలిపోతే... ఏం దారి? ఆపాదమస్తకం గజగజ వణికిపోయింది.

"బాబాయ్ ... పిల్ల లిద్దరినీ ... ఇక్కడికి తీసుకొచ్చేయనా?"

"ఏమయ్యోయ్ ... తిండీ తిప్పలూ అవసరం లేదా? నువ్వూ, నీ దేవుడూ నన్ను కాల్చుకు తింటున్నారు... ఎవ రక్కడ..." అనుకుంటూ వింతగా చూస్తూ, తలమీద కొంగు కప్పుకోవటానికి మన సొప్పక, చినుకులకి చేతు లడ్డు పెట్టుకుంటూ, పావలా కాసంత కుంకం బొట్టుతో ఎదురుగా ఉన్న ఇంట్లోంచి గబగబా అడుగులేసుకుంటూ వచ్చింది శాస్త్రి భార్య అన్నపూర్ణమ్మ.

ఆవిడ చూపుల్లో దయాదాక్షిణ్యాలు లేవు.

"ఇదుగోనే మన సుమతి ... అదే సుమతి ...! కిశోర్‌గాడి ధర్మమా అని ఈ గతి కొచ్చింది ... ఇంత బతుకూ బతికి ఇంటవతల చచ్చానన్నట్లు ... ఎవళ్ళమేం చెయ్యగలం. అదే అంటున్నా..." క్షణంలో మారిపోయినట్లున్న శాస్త్రి భార్యా భయస్థుడని సుమతికి తెలుసు.

"చాల్లేవయ్యా ... ఆడకూతురు కష్టంలో ఉన్నప్పుడే ఒక్కొక్క మాటా విసురుతారు మీ మగాళ్ళు." అన్నపూర్ణమ్మ మేనత్త కొడుకుని చిన్నప్పట్నుంచీ చెవులు పట్టుకునే ఆడించింది.

ఆమె ధోరణి కతను లోలోన ఎంతగానో సంతోషిస్తూ అన్నాడు:

"ఈ గాలివాన కా కొంప కూలిపోతుందేమోనట— ఆ గుంటల్ని తీసుకుని మనింటి కొస్తానంటూంది మధ్యన... పిల్లల్ని మనింట్లో ఉంచాలిట...ఈ సౌభాగ్యం చాలక..."

"నీ సొమ్మేం పోయిం దయితే? నువ్వూ, నీపూజలూ కంటే ఎక్కువ కష్టమా నాకు వాళ్ళు?"

సుమతి ఆనందంగా చూసింది.

"నీ కంత సరదాగా ఉంటే అనుభవించే... పిల్లలొక్కళ్ళూ ఏం ఖర్మ! తల్లినీ, పిల్లల్నీ కూడా పెట్టుకో ఇంట్లో ... నాకేం బాధ? ఇంత తినొచ్చి ఆ గర్భగుడిలోనే జపం చేసుకుంటూ కూచుంటావు నేను."

ఆశగా అన్నపూర్ణమ్మ జవాబుకోసం ఎదురు చూస్తున్నాడు శాస్త్రి.

"నా ఇష్టం ... నాకు తోచినట్టు చేస్తాను... సరేనా?"

"నీకు మతి పోతూందే... పిల్లని మ వ్వింట్లో పెట్టుకున్నావని తెలిస్తే ..."

"నీ తెలివి తెల్లారిందిలే ... అయినా, నా వెర్రిగాని పూజారి ముండావాడికి తెలివితేట లెక్కడినుంచొస్తాయి. ఈ గాలివానలో ఏ వెధవ నా ఇంటికి సోదా కొస్తాడు? వచ్చిన వాడి ముక్కు అపసవ్యంగా కోసి కారం అద్ది పంపించనూ వాడి బాబుకి వినికిరయ్యేలాగ ... సుమతీ! ఇతని మాటలేం పట్టించుకోక పిల్లల్ని తీసుకొచ్చేయ్..." దమాయింపుగా, రాజసంగా అంది అన్నపూర్ణమ్మ.

సుమతికి మళ్ళీ భయం పట్టుకుంది.

తన భుజంమీద మృత కళేబరం ఉందని తెలిస్తే ఆ క్షణంలో ఏమవుతుందో ఊహించుకుందికే గడగడలాడింది, మడికచ్చతో ఆచారాన్నంతటినీ వ్యక్తం చేసే అన్నపూర్ణమ్మను చూస్తూ.

"వద్దులెండి, పిన్నీ ... నాకేం భయంలేదుగా... పిల్లలే... వాళ్ళిద్దరే భయపడుతున్నారు... వాళ్ళని తీసుకొస్తాను ... మీ మేలు జన్మలో..."

అట్టే పొగిడినా ప్రమాదం సుమా అన్నట్టు చూస్తున్నాడు శాస్త్రి సుమతి వేపు.

"ఆ చంటిదాన్ని కూడా ఎందు కలా వర్షంలో తిప్పుతున్నావ్?" చెయ్యి వెయ్యబోయి మడి సంగతి జ్ఞాపకం వచ్చి వెనక్కి తగ్గింది అన్నపూర్ణమ్మ.

"ప...ప...పడుకుంది, పిన్నీ..." గడగడ వణికిపోయి నిలదొక్కుకుంది సుమతి.

"వెళ్ళిరా అయితే మరి... ఈ ముసలాయన్ని రోజూ భోజనానికి పిలిచేసరికే నా ఆయుర్దాయం సగం తరిగిపోయింది... ఏమయ్యోవ్! నీ స్తోత్రాలవీ తిండి

పండుగపూట — చిత్రం — వై. బాలయ్య (సిద్దిపేట)



తిన్నాక కానిచ్చుకో ... నీకూ, నీ దేవుడికీ మరేమిటి పని? మ వ్వలా పొగుడుతూంటే ఆయనగా రక్కడ కూచుని వింటూంటాడు. లోకమెలా చస్తుంటే మీకేం? మస్తుగా పెట్టే వాళ్ళుంటూంటే మరొకళ్ల సోదెందు కన లంట మీకు?"

మడికచ్చతో దర్జాగా వెళ్లిపోయిం దామె ఏదు రింట్లోకి.

"వెళతాను, బాబాయ్..." మెట్లు దిగబోయింది సుమతి.

"వేగంగా పిల్లల్నెలాగో తీసుకొచ్చేయమ్మా... అన్నట్టు ముందు ఈ నాలుగు పళ్ళు తీసుకెళ్లి పిల్లలకి పెట్టు" అంటూ లాంత రక్కడే ఉంచి రెండంగల్లో వెళ్లి దేవుడి ముందు పళ్లెంలో ఉన్న నాలు గరటిపళ్ళ్ని, రెండు మామిడి పళ్ళు తెచ్చాడు.

జాగ్రత్తగా కొంగు పట్టింది సుమతి.

"ఈ వానలో భక్తులు కూడా రావటం లేదమ్మా... దేవుడికీ కంట్రోలయిపోయింది." అంతే ఇవ్వగలుగుతూన్నందుకు బాధగా ఉం దతనికి.

"వస్తాను, బాబాయ్!"

"చంటిపిల్ల నిలా వర్షంలో ..."

"అబ్బే... గౌడు సుబ్బమ్మ కప్పజెబుతా, బాబాయ్. చాలా మంచిది..."

"సరే ... జాగర్త ... అసలే..."

సుమతి ఆ మాటలు వినిపించుకోలేదు. చకచకా గుడి మెట్లు దిగిపోయి మలుపు తిరిగింది. కాసే పయ్యాక లాంతరుతోపాటు శాస్త్రి గుళ్ళోకి వెళ్లిపోయాడు.

కటిక చీకట్లో కలిసిపోయింది సుమతి.

• • •

'శ్మశానం ఎంత దూరమో ఏమిటో ఇంకా ... ఆకలికి పిల్లలిద్దరూ ఏమైపోతున్నారో ... కృష్ణ కసలే భయ్యం జాస్తి ... ఆ గుడిసె... అవును, బాబాయ్ అన్నట్లుగా ఏమిటి తన మొండి ధైర్యం... జారిపోతే... అమ్మ బాబోయ్! పరుగెత్తి వెళ్లిపోవా లింటికి... ఈ దిక్కుమాలిన వానొకటి... శ్మశానం కేసి వెళ్లడం మానేసి...'

సుమతి బుర్ర చకచకా పనిచేస్తూంది.

'ఎక్కడ చూసినా బురద... పొలిక తెలియని పన్నుపు లున్నే ఆ బురదలో ...

'ఇది ఆలయం ... శివాలయం పెరటిలో తన కీ దుర్బుద్ధి లేమిటి? ఏం... దుర్బు ద్ధెందుకయింది?

'పరమ శివుడు శ్మశానవాసి... ఆయన సన్నిధానంలో శవము శివ మవుతుంది... నిజం...'

గుడిలో శాస్త్రి కాబోలు గంట వాయించాడు.

భయంగా పలు దిక్కులా చూసింది సుమతి.

మహావృక్షాలు ఊగిపోతున్నాయి. గాలికి అడుగులు తడబడిపోతున్నాయి. ఎక్కడా జీవి సంచారం లేదు... కటిక చీకటి.

ఉన్నచోటే కూలబడ్డట్టుగా కూచుంది సుమతి. వేళ్లతో నేల తడవటం ప్రారంభించింది.

'లాభం లేదు ... కింద కొంచెం గట్టిగా ఉంది.'

ఆమె దేకురుకుంటూ, చేత్తో తడుముకుంటూ పోతూనే ఉంది.

ఒకచోట చెయ్యి లోపలికి సునాయాసంగా కూరుకుపోయింది. మరికాస్త లోపలికి పోనిచ్చి చూసింది. ఇంకా పోతూనే ఉంది.

అర్పణ

స్త్రీ తన ప్రేమహృదయాన్ని ఒక్కరికే అర్పిస్తుంది. ఆ హృదయంలో ఎంత సౌకుమార్యం, మార్దవం! ఎన్ని త్యాగాలు, మేలిముసుగు ధరించిన ఎన్ని సుగుణాలు!

—రిచర్

"మంగళ స్వరూపా! ఇదుగో నా కానుక, స్వీకరించు." గడగడ వణుకుతున్న చేతులతో భుజం మీది శవాన్ని దించి, కన్నీటితో స్నానం చేయించి రెండు కళ్ళూ గట్టిగా మూసుకుని కుక్కేసింది బురదలో.

తనుకూడా భూమిలోకి కూరుకుపోతున్నట్లయిపోతూంది. బలంగా నిలదొక్కుకుని, శాస్త్రి ఇచ్చిన పళ్ళు జాగ్రత్తగా తడుముకుంటూ, లెక్కపెట్టుకుంటున్నట్టుగా అన్నీ పోగుచేసుకుని చీర చుట్టబెడుతూ లేచింది.

ఆ క్షణంలో ఆమె తల్లి కాదు— ఏ తల్లీ కన్నబిడ్డ శవాన్ని బురదలో పూడ్చేసి పిలయినంత వేగంగా పారిపోవాలని ప్రయత్నించదు. అసలామె మనిషి కాదు— ఏ మనిషీ బిడ్డను పోగొట్టుకుని దిక్కు తోచని స్థితిలో, కదలలేని శరీరంతో పరుగులు పెట్టటానికి ప్రయత్నించదు.

సుమతి పరుగులు పెడుతూన్నట్టుగా నడుస్తూంది కాసేపు. అడుగు తీసి అడుగు వెయ్యలేనట్టు భారంగా సాగిపోతూంది కాసేపు... వాన మళ్లీ విపరీతమైపోయింది.

అస్తవ్యస్తంగా కట్టుకున్న చిరిగిపోయిన బురద చీరలాగే ఉం దామె మనసు. దాన్ని ఏ ప్రవాహంలో ముంచి శుద్ధి పరుచుకోవాలో తెలియదు. ఆ చిల్లులు మూతపడేలా ఏం చెయ్యాలో తెలియదు.

తెల్లని బుటాల పట్టుచీరలో, ధగధగ మెరిసే నగలతో, కలకల్లాడుతూ మహాలక్ష్మిలా దేదీప్యమానంగా వెలిగిపోతూన్న ఓ స్త్రీమూర్తి ఆమె అంతరాంతరాల్లో ఎక్కడో మెదులుతూంది. తేరిపార చూచింది.

'అది తన రూపమే ... సందేహం లేదు... ఆ రూపం తనలా ఏడవటం లేదు... అబ్బ ... ఆ చిరునవ్వే చాలు ... కాని ... కాని ... అది జడత్వం... తనలో? చైతన్యం! ఈ చైతన్యవంతమైన ఆత్మ వెళ్లి ఆ రూపంలో చేరిపోతే బాగుండును...

'ఎంత పరుగెత్తుతూన్నా సూర్య చంద్రుల్లా, దిక్కుల్లా, నక్షత్రాల్లా ఆ రూపం దూరమవుతూనే ఉంది.

అది కనుపించడం మానదు.

దాన్ని చేరుకోవాలని తన కనిపించడం మానదు.

ఫెళఫెళమంటూ గుండె అదిరేలా పిడుగు పడింది. దగ్గరగా ఉన్న ఓ గుడిసె ధన్ మని కూలిపోయింది.

'అమ్మో!'

దూరంగా పెళపెళ్లాడుతూ ఓ చెట్టు నేల కొరిగిపోతూంది.

'ఇంకా తొందరగా పరుగెత్తాలి ... ఇంకా... ఇంకా...'

మూడు గజాల ముందుకి దభ్ మని తూలిపడింది సుమతి. కళ్ళు చీకట్లు కమ్మిపోతున్నాయి. లేవటానికి శక్తి లేదు.

'మెల్లగా లేవాలి ... వేగంగా లేవాలి... ఈ బురదలో పళ్ళు జారిపోతాయేమో? ఒకటి... రెండు... మూడు... నాలుగు. ఒకటి ... రెండు ... అన్నీ ఉన్నాయి... బాబాయి మంచి మనసుతో ఇచ్చాడు మరి! దేవుడా ... కనీసం నేను వెళ్లే వరకూ ఆ గుడిసె కూలిపోకుండా చూడు ... చాలు ... వచ్చేశాను... వచ్చేశాను. దగ్గరి కొచ్చేశాను... మునుకుడు లోతు నీళ్ల దగ్గర కొచ్చేశాను... ఇంకెంతసేపు ... ఇక్కడికి దగ్గరే... ఈలోగా ఏ బురద గుంటలోనూ కూరుకుపోకుండా ఉండాలి ... అరె! సీతమ్మ ఇల్లులా ఉంది — ఎలా పడిపోయిందో ... అమ్మో ... అమ్మో ...నా పిల్లలు... నా పిల్లలు...'

ప్రవాహంలో ఈదుకుపోతూంది సుమతి.

"అమ్మ... అమ్మ... మన అమ్మ అదుగో!" అది రాము కంఠం.

"అమ్మా... అమ్మా..." అది చిన్నవాడి చిన్నారి కంఠం.

'అబ్బ... ఎంత హాయిగా ఉంది...' గుడిసెముందు నిలుచున్న చోటే అలా కాసేపు నిలబడి ఆనందంగా శ్వాస పీల్చుకుంటూంది సుమతి.

"అమ్మా... అమ్మా... అమ్మా..."

'ఆహా ... సన్నాయి వాద్యం వింటున్నట్లుంది. చెవుల్లో అమృతం పోసినట్లుంది...'

ఒక పిల్లను పోగొట్టుకున్న చోటులో ఇద్దరు పిల్లలు బ్రతికి ఉన్నారన్న ఆనందం విచిత్రంగా ఉరకలు వేస్తూంది.

"బాబూ, చెయ్యి అందించమ్మా!" నీళ్లలో నిలబడి కుంగిపోతూన్నట్లున్న సుమతికి ఓ పెద్ద ఆజానుబాహువు చేయి అందించినట్లుగా ఊత ఇచ్చాడు రాము.

అంతా చీకటిమయం.

"అమ్మా ... అమ్మా ..." చీకటిలో తడుముకుంటూ మెరుపు వెలుగులో సుమతిని వాటేసుకున్నాడు కృష్ణ.

పిల్లలిద్దరినీ దగ్గరగా తీసి కౌగిలించుకుంది సుమతి. ఆ కౌగిల్లో వాళ్ల శరీరాలు తన శరీరంతో చేరిపోయి విడిపోకుండా బిగిసిపోవాలన్న తపన జాస్తిగా ఉంది.

"ఆకలి." మళ్లీ అదే మంత్రం చెవుల్లో.

అయితే, ఇప్పు డా మంత్రానికి పూర్వమంత శక్తి లేదు. చీరలో చుట్టి నడుముకు చుట్టుకున్న కట్టు విప్పి చేతి కొచ్చిన పళ్ళు తీసి ఇద్దరి చేతుల్లో పెట్టేసింది. చాలా తృప్తిగా ఉంది.

పిల్లలిద్దరూ నములుతూన్న చప్పుడు మరింత కర్ణపేయంగా ఉంది.

తొక్క తీయాలో, ఎటునుంచి తినాలో ఆలోచించే వ్యవధి లేదు వాళ్లకి. అదే సందడి... అదే సందడి...

"పళ్ళు చాలా బాగున్నాయమ్మా." నడుంచుట్టూ చేతులేసి అన్నాడు రాము.

"తాతయ్యగా రింటికి తీసుకెళతా, పదండి ... అక్క డింకా ఎన్నో తినవచ్చు..." అంటూ సుమతి పొట్టిగా ఉన్న కృష్ణను ఎత్తి చంకనేసుకోబోయి తూలిపోయి అరుగు మీద పడింది. మోచేతికి బలంగా తగిలి నొప్పెడుతూంది.

పరిగ్గా అదే సమయం చూసుకుని "అమ్మా!



ఆదివారం ఫొటో—ఎం. ఉదయభాస్కర్ (తిరుపతి)

అటుం లేదు ... 'కిశోర్ ఆనందం పట్టలేనప్పుడు తన వలాగే పిలుస్తాడు ... చాలు ... తన కిశోర్ ఆనందంగానే ఉన్నాడు.'

తృప్తిగా సుమతి తల బురదలో వాలిపోయింది.

అన్య జీవి సంచారం లేని ఆ వాతావరణంలో పంచ భూతాల రోదన అర్థం చేసుకునే దెవరు?

* * *

గంటన్నర దీర్ఘోపన్యాసానంతరం చేతులు జోడించి, కరతాళ ధ్వనుల మధ్య దిబ్బ దిగబోతున్న భుజంగరావుగారు కాలి కేదో అడ్డోలా తగిలి, తేరిపార చూసి "శివశివా!" అన్నారు.

అందరూ గుమిగూడారు.

"సందేహం లేదు ... అవి చేతులు ... దిబ్బలో శవం ఉండి ఉంటుంది..."

హాహాకారాలు, నిట్టూర్పుల మధ్య గునపంతో తవ్వుతూన్న శబ్దం వింటూంటే రక్తం పొంగు కొస్తున్నట్లుంది భుజంగరావు ముఖంలో.

"ఒకటి ... కాదు, రెండు ... కాదు ... కాదు ... మూడు!"

మూడు శవాల మీద నుంచి దూలంలా పడి ఉన్న కొమ్మ నరకబడింది.

పోలిక తెలియని రూపాలు ... వికృతాకారాలు వెక్కిరిస్తున్న ట్లున్నాయి. భరించలేని దుర్గంధం.

"అయ్యో, భగవంతుడా, ఎంత కఠిన హృదయుడివి నువ్వు! ప్చ్ ... ఏం చేస్తాం ... అనాథ ప్రేత సంస్కారం ... ఈ డబ్బుంచండి ..."

భుజంగరావు చేతుల్లోంచి రెండు నోట్లు జారి పడ్డాయి.

'హర్షధ్వానాల మధ్య స్వాగతం — హాహాకారాల మధ్య వీడ్కోలు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవ్వరికీ తెలియదు కదా!'

వేదాంతిలా ఓ చిరునవ్వు విడిచిపెట్టి కారు ఎక్కారు భుజంగరావు గారు.

దిక్కులు దిబ్బలకి కళ్లు నిండుకొచ్చాయి.

(సమాప్తం)